RNI : TGMUL/25/A1386

# తొలి అక్షరం

మా అక్షరమే - మీ ఆయుధంగా...

చైర్మన్& చీఫ్ ఎడిటర్ పస్తం సైదులు

www.tholiaksharam.com

ఎడిటర్: పి.సైదులు, సంపుటి : 03 సంచిక - 232 పేజీలు - 08 శనివారం 18 జులై 2026

## తొలి పలుకు

అతి తక్కువ కాలంలో అన్ని వర్గాల్లో విశేష ఆదరణ పొందుతున్న తొలి అక్షరం దినపత్రిక నిష్పక్షపాత విశ్వసనీత సమాచారంతో డిజిటల్ రంగంలో అగ్రస్థానంలోకి అడుగుపెడుతున్న తరుణంలో పాఠక మహాశయుల ఆదరాభిమానం మన్నల్ని పొందుతూ దూసుకుపోతున్న తొలి అక్షరం తెలుగు దినపత్రిక సూర్యోదయంతో పాటే పాఠకుల ముందుకు వస్తూ రాష్ట్రస్థాయిలో దేశస్థాయిలో ప్రపంచ స్థాయిలోని సమాజంలోని అన్ని రంగాల్లోని సంబంధిత అంశాలపై సమాచార వ్యాప్తిలో ముందుంటుంది. ఎప్పటికప్పుడు సమాచారాన్ని ముందు ఉంచడంలో తొలి అక్షరం దినపత్రిక అనేక మంది పాఠకుల ఆధార అభిమానాలు పొందుతుండడం విశేషంగా భావిస్తూ.. ఇదేవిధంగా పాఠకులు ఆదరాభిమానాలు ఇలాగే కొనసాగాలని ఆశిస్తూ....

- పి.సైదులు ఎడిటర్ తొలి అక్షరం దినపత్రిక

# తెలంగాణ కేబినేట్ కీలక నిర్ణయం

- ధరణి అక్రమాలపై విచారణకు సిట్ ఏర్పాటు
- ఇక పంచాయితీల నిధులను నేరుగా బ్యాంకులో జమ
- ట్రెజరీలో జమచేసే నిబంధన ఎత్తివేసిన కేబినేట్
- జగిత్యాల జిల్లా డిగ్రీకాలేజీలో పోస్టు భర్తీకి ఆమోదం
- పటాన్‌చెరులో ఇందిరమ్మ ఇళ్లకు భూ కేటాయింపు
- బుల్లెట్ ట్రైన్ అలైన్‌మెంట్ మార్పునకు ఆమోదం
- దేవాదుల, చిన్న కాళేశ్వరం, పాలమూరు- సీతారామల అంచనా వ్యయాల పెంపు



**తొలి అక్షరం/హైదరాబాద్, జూలై 17 :** తెలంగాణ రాష్ట్ర క్యాబినెట్ సమావేశంలో పలు కీలక నిర్ణయాలకు ఆమోదం లభించింది. ప్రజా సంక్షేమం, పరిపాలన సంస్కరణలు, మౌలిక వసతుల అభివృద్ధే ధ్యేయంగా ప్రభుత్వం పలు కీలక నిర్ణయాలను తీసుకుంది. సీఎం రేవంత్‌రెడ్డి అధ్యక్షతన శుక్రవారం జరిగిన తెలంగాణ మంత్రివర్గ సమావేశం ముగిసింది. దాదాపు మూడుగంటలపాటు సమావేశమైన మంత్రివర్గం కీలక నిర్ణయాలు తీసుకుంది. ఈ సందర్భంగా ధరణి, నీటిపారుదల ప్రాజెక్టులు, బుల్లెట్ ట్రైన్, డిగ్రీ కళాశాలల్లో పోస్టుల భర్తీ, ఇందిరమ్మ ఇళ్లు, గ్రామ పంచాయతీల ఆదాయం వంటి అంశాలు ప్రధానంగా చర్చకు వచ్చాయి. క్యాబినెట్ భేటీలో పలు కీలక నిర్ణయాలకు ఆమోదం తెలిపారు. గత ప్రభుత్వ హయాంలో జరిగిన ధరణి లావాదేవీలపై సమగ్ర విచారణ జరపాలని మిగతా2లో...



# భారతీయ రైల్వే చరిత్రలో మరో మైలురాయి

- హైడ్రోజన్ రైలుతో నూతన శకం ఆరంభం
- తొలి రైతులను జెండా ఊపి ప్రారంభించిన మోడీ
- అనేక ప్రత్యేకతలతో పర్యావరణహితంగా తయారీ

**తొలి అక్షరం/న్యూఢిల్లీ,జూలై 17 :** దేశం లోనే మొట్టమొదటి హైడ్రోజన్ పవర్డ్ రైలును ప్రధాని మోదీ శుక్రవారం హర్యానాలో జెండా ఊపి ప్రారంభించారు. ఈ రైలు హర్యాలోని జింద్, సోనిపట్ మధ్య (89 కి.మీ) నడవనుంది. పర్యావరణ పరిరక్షణకు, పచ్చదనాన్ని కాపాడుకోవడానికి రైల్వే వ్యవస్థలో ఇది ఒక చరిత్రాత్మక ముందడుగు అని ఈ సందర్భంగా ప్రధాని మోదీ అన్నారు. స్వదేశీ పరిజ్ఞానంతో దీన్ని తయారు చేయడం దేశ గర్వకారణమని వెల్లడించారు. అధునాతన రైల్వే ఇంజినీరింగ్‌లో దేశ సామర్థ్యాలకు ఇది మిగతా2లో...




## నేడు బిఆర్ఎస్ యువ సంగ్రామ సభ

- సరూర్‌నగర్ స్టేడియంలో సభ నిర్వహణ
- పోలీసుల అనుమతి నిరాకరణతో హైకోర్టు అనుమతి

**తొలి అక్షరం/హైదరాబాద్, జూలై 17 :** బీఆర్ఎస్ పార్టీ ఎంతో ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించ తలపెట్టిన 'బీఆర్ఎస్ యువ సంగ్రామ సభ'కు తెలంగాణ హైకోర్టు అనుమతి ఇచ్చింది. శనివారం నాడు హైదరాబాద్‌లోని సరూర్‌నగర్ మిగతా2లో...


## ఉద్యోగులు, పెన్షనర్లకు శుభవార్త

- నగదురహిత వైద్య సేవలకు శ్రీకారం
- ఇచ్చిన హామీ మేరకం పథకం ప్రారంభం




## రాష్ట్రంలో 12 కొవిడ్ కేసులు

- నాలుగు జిల్లాల్లో చెదురుమొదురుగా నమోదు
- పూణే ల్యాబ్‌కు జన్యుక్రమ విశ్లేషణ నిమిత్తం 5 నమూనాలు
- జులై ఒకటి నుంచి దేశవ్యాప్తంగా 339 కోవిడ్ కేసుల నమోదు



**తొలి అక్షరం/హైదరాబాద్, జూలై 17 :** రాష్ట్రంలో ఆంధ్రప్రదేశ్‌లో కరోనా మహమ్మారి మళ్లీ కలకలం రేపుతోంది. రాష్ట్రంలోని పలు జిల్లాల్లో కొత్తగా కోవిడ్-19 పాజిటివ్ కేసులు నమోదవడంతో ఆరోగ్య శాఖ అప్రమత్తమైంది. తక్షణమే అప్రమత్తంగా ఉండాలని జిల్లా అధికారులకు కీలక ఆదేశాలు జారీ చేసింది. వివరాల్లోకి వెళితే, జూన్ 26వ తేదీ నుంచి జులై 16 వరకు మిగతా2లో...



## దేవాదాయ శాఖలో అరుదైన ఘట్టం

- ఏకంగా 191 మందికి ఉద్యోగ నియామక పత్రాలు
- రవీంద్రభారతి వేదికగా మయంత్రి కొండా సురుఖ అందచేత
- దేవాలయాల అభివృద్ధికి ప్రత్యేక కృషి చేస్తున్నామన్న మంత్రి
- వర్షాల కోసం ఆలయాల్లో వరుణయాగం నిర్వహణకు సంకల్పం

**తొలి అక్షరం/హైదరాబాద్, జూలై 17 :** దేవాలయం అనేది భారతీయ సంస్కృతి, సంప్రదాయాలు, వైదిక విజ్ఞానానికి, ధర్మ పరిరక్షణకు కేంద్రంగా నిలిచే పవిత్ర క్షేత్రమని దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ అన్నారు. అలాంటి దేవాలయాల వైభవాన్ని పరిరక్షించే బాధ్యతను నిర్వర్తించే అర్చకులు, వేదపండితులు, పరిచారకులు, వాయిద్య కళాకారులు, దేవాలయ వంట సిబ్బంది సేవలు అత్యంత పవిత్రమైనవని మంత్రి సురేఖ పేర్కొన్నారు. ఎంతో అదృష్టం చేసుకుంటేగానీ దేవుని సేవలో తరించే భాగ్యం దక్కదని మంత్రి సురేఖ అన్నారు. శుక్రవారం హైదరాబాద్‌లోని రవీంద్ర భారతిలో 191 మంది మతపరమైన ఉద్యోగుల నియామక ఉత్తర్వుల అందజేత కార్యక్రమంలో మంత్రి కొండా సురేఖ పాల్గొన్నారు. ఉద్యోగాలు సాధించిన పలువురికి నియామక పత్రాలు అందజేశారు. వీరిలో రాష్ట్రవ్యాప్తంగా 47 ఆలయాలకు ఎంపికైన అర్చకులు, వేదపండితులు, పరిచారకులు, మృదంగం, డోలు, సన్నాయి, శృతి, తాళం తదితర విభాగాలకు చెందిన మిగతా2లో...

## న్యాయవాదుల సంక్షేమానికి తెలంగాణ కృషి ప్రశంసనీయం

- రూ.100 కోట్లతో నిధి ఏర్పాటు చేయడం అభినందనీయం
- సుప్రీం చీఫ్ జస్టిస్ సూర్యకాంత్ ప్రశంసలు



**తొలి అక్షరం/హైదరాబాద్, జూలై 17 :** న్యాయవాదుల సంక్షేమం కోసం తెలంగాణ ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలను సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్ ప్రశంసించారు. న్యాయవాదుల సంక్షేమ నిధిని రూ.100 కోట్లతో ఏర్పాటు చేయడం అభినందనీయమని పేర్కొన్నారు. న్యాయవాదుల సంక్షేమానికి సంబంధించి తెలంగాణ ప్రభుత్వం సుప్రీంకోర్టులో దాఖలు చేసిన అఫిడవిట్‌పై విచారణ సందర్భంగా సీజేఐ మిగతా2లో...

## 60శాతం సర్ డిజిటైజేషన్ పూర్తి

- రాష్ట్ర ఎన్నికల అధికారి సుదర్శన్ రెడ్డి



**తొలి అక్షరం/హైదరాబాద్, జూలై 17 :** రాష్ట్రంలో ఇప్పటి వరకూ సర్ ప్రక్రియ 60 శాతం డిజిటైజేషన్ పూర్తయిందని రాష్ట్ర ఎన్నికల అధికారి సుదర్శన్ రెడ్డి తెలిపారు. సంగారెడ్డి జిల్లా పటాన్ చెరు నియోజకవర్గంలోని సుల్తాన్పూర్, ఐలాపూర్, పటాన్ చెరులో బీఎల్వోలు నిర్వహిస్తున్న సర్ శిబిరాలను జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్‌తో కలిసి సుదర్శన్‌రెడ్డి పరిశీలించారు. సర్ ప్రక్రియపై బీఎల్వోలను అడిగి వివరాలు మిగతా2లో...

# తెలంగాణ కేబినేట్ కీలక నిర్ణయం

(మొదటి పేజీ తరువాయి)
మంత్రివర్గం నిర్ణయించింది. వివిధ శాఖల అధికారులు, నిపుణులతో ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్) ఏర్పాటు చేయాలని సమావేశంలో నిర్ణయం తీసుకున్నారు. ధరణిపై దర్యాప్తునకు ప్రత్యేక టీమ్ ఏర్పాటు చేయడంతో పాటు ధరణి ప్రారంభమైనప్పటి నుంచి ఇప్పటి వరకు ఫోరెన్సిక్ ఆడిట్ నిర్వహణకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది.గ్రామ పంచాయతీల సొంత ఆదాయం పంచాయతీ ఖాతాలోనే జమ చేయాలనే నిర్ణయానికి క్యాబినెట్ ఆమోదం తెలిపింది. జగిత్యాల జిల్లాలోని ప్రభుత్వ డిగ్రీ కాలేజీలో విద్యా ప్రమాణాలను పెంచేందుకు, విద్యార్థులకు మెరుగైన బోధన అందించేందుకు వీలుగా పలు కొత్త పోస్టుల భర్తీకి క్యాబినెట్ పచ్చజెండా ఊపింది. అలాగే, పఠాన్‌చెరు నియోజకవర్గ పరిధిలో నిరుపేదలకు ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాన్ని వేగవంతం చేసేందుకు అవసరమైన భూమిని కేటాయిస్తూ కీలక నిర్ణయం తీసుకుంది. సాంకేతిక కారణాలు, ప్రయాణికులకు మరింత లబ్ది చేకూర్చేలా బుల్లెట్ ట్రైన్ అలైన్‌మెంట్ మార్పు ప్రతిపాదనకు కూడా మంత్రిమండలి ఆమోదం తెలిపింది. ఈ క్యాబినెట్ సమావేశంలో గ్రామీణ పల్లెల స్వయంప్రతిపత్తిని బలోపేతం చేసే దిశగా అత్యంత కీలక నిర్ణయం తీసుకున్నారు. తెలంగాణ పంచాయతీ రాజ్ చట్టం-2018 సవరణకు క్యాబినెట్ ఆమోదం తెలిపింది. ఇందులో భాగంగా చట్టంలోని సెక్షన్ 70(3)ను సవరించనున్నారు. ఇప్పటివరకు గ్రామ పంచాయతీలకు పన్నులు, ఇతర వనరుల ద్వారా వచ్చే నిధులు, సొంత ఆదాయంప్రభుత్వ ట్రెజరీలో జమ అయ్యేవి. దీనివల్ల అత్యవసర గ్రామ వికాస పనులకు నిధులు డ్రా చేయడం సర్పంచులు లేదా స్థానిక అధికారులకు ఆలస్యమయ్యేది. ఈ ఇబ్బందులను తొలగిస్తూ, ఇకపై గ్రామ పంచాయతీల సొంత ఆదాయాన్ని ట్రెజరీతో సంబంధం లేకుండా నేరుగా సదరు గ్రామ పంచాయతీ బ్యాంక్ ఖాతాలోనే జమ చేసుకునేలా చట్ట సవరణకు ఆమోదం లభించింది. దీనివల్ల గ్రామాల్లో అభివృద్ధి పనులు మరింత వేగంగా జరగడానికి వీలవుతుంది. ఈ చట్ట సవరణను తక్షణమే అమలుల్లోకి తీసుకువచ్చేందుకు వీలుగా ప్రభుత్వం త్వరలోనే ప్రత్యేక ఆర్డినెన్స్‌ను జారీ చేయనుంది. ఈ సమావేశంలో దేవాదుల, చిన్న కాళేశ్వరం, పాలమూరు-రంగారెడ్డి, సీతారామ ప్రాజెక్టుల అంచనా వ్యయాలను పెంచాలని క్యాబినెట్ నిర్ణయించింది. మరోవైపు, మంత్రిమండలి నిర్ణయంతో సిట్ ఏర్పాటుకు కాంగ్రెస్ ప్రభుత్వం కసరత్తు ప్రారంభించింది. సిట్ ద్వారా భూ రికార్డుల మార్పులు, అక్రమ మ్యుటేషన్లపై విచారణ చేపట్టాలని భావిస్తోంది. ప్రభుత్వ, అసైన్డ్, వక్ఫ్, దేవాదాయ భూముల లావాదేవీలపైనా ప్రత్యేక దృష్టి సారించనుంది. అక్రమాలకు పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకునేందుకు ప్రభుత్వం సిద్ధమైంది. అవసరమైతే మాజీ అధికారులు, బాధ్యులకు నోటీసులు జారీ చేయాలని భావిస్తోంది. సాంకేతిక అంశాలపై నిపుణుల సహకారంతో దర్యాప్తు చేపట్టాలని నిర్ణయించింది. ధరణి ద్వారా జరిగిన భూ వివాదాలన్నింటిపైనా వివరాల సేకరణకు కసరత్తు చేస్తోంది. అక్రమంగా లబ్ది పొందిన వారిపై కేసులు నమోదు చేయాలని నిర్ణయించింది. ఇందుకు రాష్ట్రవ్యాప్తంగా ఫిర్యాదులు, సంబంధిత పత్రాల పరిశీలనను ప్రారంభించాలని తీర్మానించింది. సిట్ ద్వారా ధరణి అక్రమాలపై వాస్తవాలను వెలుగులోకి తీసుకురావడమే లక్ష్యంగా ప్రయత్నాలను ప్రభుత్వం ముమ్మరం చేసింది.

# దేవాదాయ శాఖలో అరుదైన ఘట్టం

(మొదటి పేజీ తరువాయి)
ఉద్యోగులున్నారు. 191 మంది ఉద్యోగుల నియామకం చేపట్టడం తెలంగాణ దేవాదాయ శాఖ చరిత్రలో సువర్ణాక్షరాలతో లిఖించదగ్గ చారిత్రాత్మక ఘట్టమని మంత్రి పేర్కొన్నారు. కార్యక్రమంలో దేవాదాయ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ శైలజా రామయ్యర్, డైరక్టర్ హనుమంతరావు, ధార్మిక సలహాదారు గోవింద హరి, స్టేట్ ఇన్సిటిట్యూట్ ఆఫ్ టెంపుల్ అడ్మినిస్ట్రేషన్ డైరక్టర్ విజయ రాఘవాచార్యులు, దేవాదాయశాఖ ఆర్‌జెసి రామకృష్ణారావు, డిసి కృష్ణప్రసాద్, ఎడిసి లు శ్రీనివాస్, జ్యోతి, ఎసి రామాల సునీత, తెలంగాణ దేవాదాయ శాఖ అర్చక ఉద్యోగ జాక్ కన్వీనర్ డి.వి.ఆర్.శర్మ, బ్రాహ్మణ సంక్షేమ పరిషత్ చైర్మన్ బసవరాజు శ్రీనివాస్, డాక్టర్ ఆర్. శ్రీరామ ఘనాపాటి, కేంద్రమాజీ మంత్రి డాక్టర్ ఎస్. వేణుగోపాలాచారి, పలువురు దేవాదాయ శాఖ అధికారులు తదితరులు పాల్గొన్నారు. సందర్భంగా మంత్రి కొండా సురేఖ మాట్లాడుతూ, రాష్ట్ర ప్రభుత్వం దేవాలయాల అభివృద్ధికి, భక్తులకు నాణ్యమైన సేవలు అందించడానికి అత్యంత ప్రాధాన్యత ఇస్తున్నదని తెలిపారు. ఆలయాల్లో ఖాళీగా ఉన్న మతపరమైన పోస్టులను భర్తీ చేయడం ద్వారా నిత్యకైంకర్యాలు, వేదపారాయణాలు, ఉత్సవాలు, ధార్మిక కార్యక్రమాలు మరింత క్రమబద్ధంగా నిర్వహించేందుకు వీలు కలుగుతుందని స్పష్టం చేశారు. అర్చకుల దేవతారాధన, వేదపండితుల వేద పారాయణం, పరిచారకుల నిత్య కైంకర్య సేవలు, ఆధ్యాత్మికశోభను పెంపొందించే మృదంగ వాయిద్య కళాకారులు, దైవానికి నైవేద్యం, భక్తులకు ప్రసాదాన్ని సిద్ధంచేసే వంటవారు తదితర ఉద్యోగులంతా నిష్ఠతో వుంటేనే దేవాలయాల వైభవం, పవిత్రత, ప్రతిష్ఠలు మరింత ఇనుమడిస్తాయని మంత్రి సురేఖ పేర్కొన్నారు. దేవాలయ ఉద్యోగమంటే ఉపాధి లేదా ఉద్యోగంగా భావించకుండా భగవంతుని సేవ చేసే అరుదైన అవకాశం, ఆధ్యాత్మిక విలువలను పెంపొందించే గొప్ప బాధ్యత అని మీరు భావించాలి. ఈ బాధ్యతను అత్యంత నిబద్ధతతో నిర్వర్తించి భక్తుల విశ్వాసాన్ని నిలబెట్టాలఅని మంత్రి సురేఖ నియామక ఉత్తర్వులందుకున్న ఉద్యోగులకు సూచించారు. రాష్ట్రవ్యాప్తంగా ఆయా దేవాలయాలకు ప్రత్యేకంగా భావించే రోజుల్లో ఆధ్యాత్మిక, ధార్మిక, పురాణ ప్రవచనాలు చెప్పే విధంగా త్వరలో ఉత్తర్వులిస్తామని మంత్రి సురేఖ ప్రకటించారు. త్వరలో ఆయా గుళ్ళలో పనిచేసే అన్ని విభాగాల ఉద్యోగస్తులకు పనితీరును బట్టి అవార్డులు ఇస్తామని తెలిపారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సారథ్యంలో ఇప్పటికే సరస్వతి నది ఆది, అంత్య పుష్కరాలను వైభవోపేతంగా నిర్వహించిందని, రాబోయే రోజులు గోదావరి, కృష్ణ నదీ పుష్కరాలను అదే స్థాయిలో నిర్వహిస్తామని మంత్రి సురేఖ స్పష్టం చేశారు. గిరిజన జాతరగా ఖ్యాతిగాంచిన మేడారం సమ్మక్క సారక్క జాతర ప్రాంగణాన్ని అద్భుతంగా తీర్చిదిద్దిన విషయాన్ని గుర్తు చేశారు. ఈష్ట్రంలో ఎల్ నినో కారణంగా వర్షాభావ పరిస్థితుల నేపథ్యంలో త్వరలో రాష్ట్రవ్యాప్తంగా అన్ని దేవాలయాల్లో వరుణయాగం నిర్వహిస్తామని మంత్రి ప్రకటించారు. ఈ యాగాల ద్వారా రాష్ట్రంలో సమృద్ధిగా వర్షాలు కురిసి, ప్రజలు సుభిక్షంగా ఉండాలని ఆయా దేవాలయాల్లో పూజలు చేయాలని మంత్రి సురేఖ పిలుపునిచ్చారు. మంత్రి సురేఖని దేవాదాయ ఉద్యోగులు గజమాలతో సత్కరించి కృతజ్ఞతలు తెలిపారు.

# న్యాయవాదుల సంక్షేమానికి తెలంగాణ కృషి ప్రశంసనీయం

(మొదటి పేజీ తరువాయి)
ఈ వ్యాఖ్యలు చేశారు. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న న్యాయవాదుల సంక్షేమ పథకాల వివరాలను సీజేఐ ధర్మాసనానికి అడ్వకేట్ జనరల్ సుదర్శన్ రెడ్డి వివరించారు. ఈ సందర్భంగా న్యాయవాదుల సంక్షేమం కోసం తెలంగాణ అడ్వకేట్స్ వెల్ఫేర్ ట్రస్ట్ ద్వారా ప్రత్యేక చర్యలు చేపడుతున్నట్లు ప్రభుత్వం అఫిడవిట్‌లో పేర్కొంది. కెనరా బ్యాంకులో రూ.100 కోట్ల శాశ్వత కార్పస్ ఫండ్‌ను ఏర్పాటు చేశామని, దీనిపై వచ్చే వడ్డీ ద్వారా సంక్షేమ కార్యక్రమాలను అమలు చేస్తున్నామని తెలిపింది. అలాగే 2022 నుంచి 2026 వరకు న్యాయవాదుల సంక్షేమ ట్రస్ట్‌కు అదనంగా రూ.7 కోట్ల నిధులను కేటాయించినట్లు వెల్లడించింది. రాష్ట్రంలో సుమారు 50 వేల మంది న్యాయవాదుల కుటుంబాలకు ఉచిత ఆరోగ్య, ప్రమాద బీమా సౌకర్యాలు కల్పిస్తున్నట్లు వివరించింది. ప్రతి న్యాయవాది కుటుంబానికి రూ.2లక్షల వరకు ఉచిత ఆరోగ్య బీమా సౌకర్యం అందిస్తున్నామని ప్రభుత్వం పేర్కొంది.

అలాగే ప్రమాదవశాత్తు న్యాయవాది మరణిస్తే ఆ కుటుంబానికి ఆర్థిక భరోసా కల్పించేందుకు రూ.10 లక్షల వ్యక్తిగత ప్రమాద బీమా అమలు చేస్తున్నట్లు తెలిపింది. ఈ బీమా ప్రీమియం మొత్తాన్ని ప్రభుత్వమే పూర్తిగా భరిస్తోందని, దేశంలో న్యాయవాదుల సంక్షేమానికి ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తున్న రాష్ట్రాల్లో తెలంగాణ ముందంజలో ఉందని అఫిడవిట్‌లో పేర్కొంది. కాగా, మహిళా న్యాయవాదులకు కోర్టుల్లో కనీస సదుపాయాలు కల్పించే అంశంపై సమీక్ష నిర్వహించి నివేదిక సమర్పించాలని అడ్వకేట్ జనరల్‌ను సీజేఐ జస్టిస్ సూర్యకాంత్ ఆదేశించారు. మహిళా న్యాయవాదులు ఎదుర్కొంటున్న సమస్యలు, వారికి అవసరమైన మౌలిక వసతులపై వివరాలు సేకరించాలని సూచించారు. ఈ మేరకు సుప్రీంకోర్టులో రిట్ పిటిషన్ నంబర్ 770/2026 విచారణ సందర్భంగా తెలంగాణ న్యాయశాఖ కార్యదర్శి బి.పాపిరెడ్డి ఈ అఫిడవిట్‌ను సమర్పించారు. ఈ సందర్భంగా న్యాయవాదుల వైద్య అత్యవసరాలు, కుటుంబ భద్రత, ఆర్థిక సహాయానికి తెలంగాణ అడ్వకేట్స్ వెల్ఫేర్ ట్రస్ట్ నిరంతరం పనిచేస్తోందని అఫిడవిట్‌లో ప్రభుత్వం తెలిపింది. భవిష్యత్తులో మరిన్ని సంక్షేమ పథకాలను విస్తరించే ప్రణాళికలు ఉన్నాయనీ వెల్లడించింది.

# ప్రజల విశ్వాసాన్ని కోల్పోయింది

- అన్ని వర్గాలనూ మోసం చేసిన కాంగ్రెస్ ప్రభుత్వం
- రేపు సరూర్‌నగర్‌లో యువ సంగ్రామ సదస్సు : బీఆర్‌ఎస్ ప్రజాప్రతినిధుల సమావేశంలో కేటీఆర్



**తొలి అక్షరం/హైదరాబాద్, జూలై 17 :** కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజల విశ్వాసాన్ని పూర్తిగా కోల్పోయిందని బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కల్వకుంట్ల తారక రామారావు (కేటీఆర్) విమర్శించారు. అన్ని వర్గాలనూ మోసం చేసిన ప్రభుత్వానికి ప్రజలే తగిన గుణపాఠం చెబుతారని హెచ్చరించారు. శనివారం సరూర్‌నగర్ స్టేడియంలో యువ సంగ్రామ సదస్సును నిర్వహిస్తామని చెప్పారు. గురువారం హైదరాబాద్ నగరానికి చెందిన బీఆర్‌ఎస్ ఎమ్మెల్యేలు, ప్రజాప్రతినిధులు, సీనియర్ నాయకులతో కలిసి ఎల్బీనగర్ ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి నివాసంలో కేటీఆర్ సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ ఆడబిడ్డల నుంచి అన్నదాతల వరకు, విద్యార్థుల నుంచి నిరుద్యోగ యువత వరకు ఏ ఒక్కరికీ ఇచ్చిన హామీలను కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేయలేదని అన్నారు. ప్రజా సంక్షేమాన్ని పూర్తిగా విస్మరించి, అవినీతి, స్కామ్‌లు, అక్రమాలు, అరాచకాలనే పాలనగా మార్చుకున్నారని ఆరోపించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మాట్లాడుతున్న మాటలు, అనుసరిస్తున్న విధానాలు, సాగిస్తున్న పాలన ప్రజా కంటకంగా మారా యని విమర్శించారు. సీఎం చేయించుకున్న సర్వేలోనే కాంగ్రెస్ ప్రభుత్వంపై తీవ్రమైన ప్రజా వ్యతిరేకత వ్యక్తమైందని వివరించారు. చివరికి యువత, నిరుద్యోగుల విషయంలోనూ కాంగ్రెస్ ప్రభుత్వం "యూత్ డిక్లరేషన్" పేరిట భారీ మోసం చేసిందన్నారు. వరంగల్ రైతు సభ అనంతరం, శనివారం సరూర్‌నగర్ స్టేడియంలో యువత, విద్యార్థులతో భారీ యువజన సదస్సు నిర్వహించి కాంగ్రెస్ యూత్ డిక్లరేషన్ వైఫల్యాలను ప్రజల ముందుంచుతామని తెలిపారు. **సభకు అడ్డంకులు సృష్టించే అవకాశం** యువజన సభకు కాంగ్రెస్ పార్టీ అడ్డంకులు సృష్టించే అవకాశం ఉందనీ, అలాంటి ప్రయత్నాలను సమర్థవంతంగా ఎదుర్కొనేందుకు నాయకులు, కార్యకర్తలు సిద్ధంగా ఉండాలని కేటీఆర్ సూచించారు. హైదరాబాద్‌తోపాటు పరిసర అసెంబ్లీ నియోజకవర్గాల నుంచి కూడా భారీ సంఖ్యలో యువత స్వచ్ఛందంగా సభకు తరలివస్తారని పార్టీ సీనియర్ నాయకులు కేటీఆర్‌కు వివరించారు. యువజన సభను విజయవంతం చేసేందుకు చేపట్టాల్సిన అన్ని ఏర్పాట్లపై సమావేశంలో సుదీర్ఘంగా చర్చించారు.

# భారతీయ రైల్వే చరిత్రలో మరో మైలురాయి

(మొదటి పేజీ తరువాయి)
నిదర్శమని కొనియాడారు.ఇదిబొగ్గు, డీజిల్ అవసరం లేకుండా కేవలం హైడ్రోజన్ ఫ్యూయల్ సెల్ టెక్నాలజీతో నడుస్తుంది. ఇది రైలును ముందుకు నడపటానికి హైడ్రోజన్‌ను విద్యుత్తుగా మారుస్తుంది. ఈ ప్రక్రియలో ఉప ఉత్పత్తిగా కేవలం నీటి ఆవిరి మాత్రమే వెలువడుతుంది. దీనివల్ల రైలు నడుస్తున్నప్పుడు కార్బన్ ఉద్గారాలు సున్నాగా ఉంటాయి.పర్యావరణహితంగా 'నమో గ్రీన్‌రైలు' పేరుతో నడిచే ఈ రైలుకు 10 కోచ్‌లు, 3200 హెచ్‌పీ ఇంజిన్ ఉన్నాయి. ఈ రైలు సుమారు గంటకు 110 కి.మీ వేగంతో ప్రయాణిస్తుంది. ఈ రైలులో దాదాపు 2600 మంది ప్రయాణికులు ప్రయాణం చేయవచ్చు. ఈ రైలును చెన్నైలోని ఇంటిగ్రల్ కోచ్ ఫ్యాక్టరీ నిర్మించింది. దీంతో హైడ్రోజన్ ఆధారిత రైళ్లను నడుపుతున్న ప్రపంచంలో అతికొద్ది దేశాల సరసన భారత్ నిలిచింది.ప్రపంచంలో మొట్టమొదటి హైడ్రోజన్ రైలు జర్మనీలో నడిపారు. ఆ తరువాత జపాన్, చైనా, యూఎస్‌లలో కూడా హైడ్రోజన్ రైళ్లను ప్రారంభించారు.

# రాష్ట్రంలో 12 కొవిడ్ కేసులు

(మొదటి పేజీ తరువాయి)
రాష్ట్రంలో మొత్తం 12 కరోనా పాజిటివ్ కేసులు వెలుగు చూశాయి. ఈ కేసులను కడప, విశాఖపట్నం, కాకినాడ, గుంటూరు జిల్లాల్లో గుర్తించారు. ఆందోళన కలిగించే విషయం ఏమిటంటే, ఈ కేసుల్లో నలుగురు మరణించినట్లు ఆరోగ్య శాఖ వర్గాలు ధ్రువీకరించాయి. మిగిలిన బాధితుల్లో ముగ్గురు ప్రస్తుతం హోం ఐసోలేషన్‌లో ఉండగా, ఇతరులు వైద్యుల పర్యవేక్షణలో చికిత్స పొందుతున్నారు.ఈ పరిణామాల నేపథ్యంలో ఆరోగ్య శాఖ అప్రమత్తమైంది. కరోనా లక్షణాలు కనిపించిన వారికి వెంటనే పరీక్షలు నిర్వహించాలని జిల్లా వైద్యాధికారులను ఆదేశించింది. అన్ని ప్రభుత్వ ఆసుపత్రుల్లో అవసరమైన మందులు, టెస్టింగ్ కిట్లు, ఆక్సిజన్ నిల్వలను సిద్ధంగా ఉంచుకోవాలని స్పష్టమైన సూచనలు ఇచ్చింది. ప్రస్తుతానికి కేసుల సంఖ్య తక్కువగానే ఉన్నప్పటికీ, ప్రజలు జాగ్రత్తగా ఉండాలని, ఏమాత్రం నిర్లక్ష్యం చేయవద్దని అధికారులు సూచిస్తున్నారు. పరిస్థితిని నిశితంగా గమనిస్తున్నట్లు తెలిపారు.

# ఉద్యోగులు, పెన్షనర్లకు శుభవార్త

**తొలి అక్షరం/హైదరాబాద్, జూలై 17 :** తెలంగాణ ప్రభుత్వ ఉద్యోగులు, పెన్షనర్లకు కాంగ్రెస్ ప్రభుత్వం శుభవార్త చెప్పింది. ఎంతో కాలంగా ఎదురుచూస్తున్న నగదు రహిత వైద్య సేవల పథకాన్ని ప్రారంభించింది. దీనిని తెలంగాణ ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ లాంఛనంగా ప్రారంభించారు. పోర్టల్, డిజిటల్ హెల్త్ కార్డులు, ట్రస్ట్ డీడ్‌ను మంత్రులు ఆవిష్కరించారు. ఈ పథకం ద్వారా మొత్తం 17.88 లక్షల మందికి ఆరోగ్య భద్రత లభించనుంది. రాష్ట్రవ్యాప్తంగా 886 ప్రైవేట్, 114 ప్రభుత్వ ఆస్పత్రుల్లో లబ్దిదారులకి నగదు రహిత చికిత్స పొందే అవకాశం కల్పించారు. అపోలో, యశోద, కిమ్స్, మెడికవర్, కేర్, కామినేని, కాంటినెంటల్, స్టార్, బసవతారకం వంటి కార్పొరేట్ ఆస్పత్రుల్లోనూ సేవలు పొందొచ్చు. మొత్తం 1,816 వైద్య, శస్త్రచికిత్స ప్యాకేజీలను ఈ పథకం ద్వారా అమలు చేయనున్నారు. ప్రీ-ఆథరైజేషన్ నుంచి కెయిమ్ సెటిల్‌మెంట్ వరకు పక్రియ మొత్తం పూర్తిగా డిజిటల్ విధానంలో కొనసాగనుంది. ఉద్యోగులు, పెన్షనర్ల భాగస్వామ్యంతో ట్రస్ట్ ద్వారా దీన్ని అమలు చేయనున్నారు. ఉద్యోగుల కంట్రిబ్యూషన్‌కు సమానంగా ప్రభుత్వం కూడా వాటా ఇవ్వనుంది. దీని అమలు కోసం రాష్ట్రంలో ప్రస్తుతం 12 వెల్‌నెస్ సెంటర్లు ఉండగా.. త్వరలో మరో 24 వెల్‌నెస్ సెంటర్లు ఏర్పాటు చేయనున్నారు. ఇకపై ప్రతి వెల్‌నెస్ సెంటర్‌ను ప్రభుత్వ జనరల్ ఆస్పత్రితో అనుసంధానం చేయనున్నారు. దీని ద్వారా నాణ్యమైన, పారదర్శక, సుస్థిర వైద్య సేవలను ఉద్యోగులు, పెన్షనర్లు, వారి కుటుంబ సభ్యులకు అందించే దిశగా తెలంగాణ ప్రభుత్వం కీలక అడుగు వేసినట్లైంది.

# నేడు బిఆర్ఎస్ యువ సంగ్రామ సభ

(మొదటి పేజీ తరువాయి)
స్టేడియంలో సభ నిర్వహించుకోవచ్చని తెలిపింది. ఈ మేరకు షరతులతో కూడిన అనుమతిని హైకోర్టు ఇచ్చింది. సభ రోజు హైవేను బ్లాక్ చేయొద్దని విచారణ సందర్భంగా ధర్మాసనం ఆదేశించింది. శాంతిభద్రతలకు ఎలాంటి విఘాతం కలిగించొద్దని పేర్కొంది. పోలీసుల సూచనలు పాటించాలని ఆదేశించింది. హైకోర్టు ఆదేశాలతో బీఆర్‌ఎస్ శ్రేణుల్లో ఉత్సాహం నెలకొంది. తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల వేళ కాంగ్రెస్ అగ్రనేతలు రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీలు రాష్ట్ర యువతకు అనేక హామీలు ఇచ్చారని బీఆర్‌ఎస్ యువజన విభాగం నేతలు చెబుతున్నారు. ఆ సమయంలో సరూర్‌నగర్ స్టేడియం నుంచే వారు యూత్ డిక్లరేషన్ ప్రకటించారని వెల్లడిస్తున్నారు. నిరుద్యోగ భృతి, జాబ్ క్యాలెండర్, ఫీజు రీయింబర్స్‌మెంట్ వంటి ఎన్నో వాగ్దానాలను యువతకు ఇచ్చారని అంటున్నారు. నమ్మించి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్.. ఇప్పుడు వారిని మోసం చేస్తోందని ఆరోపిస్తున్నారు. యువతకు ఇచ్చిన హామీలను కాంగ్రెస్ ఇప్పటివరకు అమలు చేయలేదని బీఆర్‌ఎస్ యువజన విభాగం నేతలు పేర్కొంటున్నారు. ఈ మేరకు బీఆర్‌ఎస్ యువ సంగ్రామ సభ ద్వారా కాంగ్రెస్ ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావాలని గులాబీ నేతలు నిర్ణయించారు. అయితే, ఈ సభకు పోలీసులు అనుమతి నిరాకరించారు. దీంతో తెలంగాణ హైకోర్టును బీఆర్‌ఎస్ నేతలు ఆశ్రయించగా.. తాజాగా వారి సభకు న్యాయస్థానం పచ్చజెండా ఊపింది. ఈ మేరకు శనివారం నిర్వహించే సభకు రాష్ట్రవ్యాప్తంగా ఉన్న నిరుద్యోగులు, విద్యార్థులు, యువత పెద్దఎత్తున తరలిరావాలని గులాబీ నేతలు పిలుపునిచ్చారు. కాగా, ఈ సభకు పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ముఖ్య అతిథిగా హాజరుకానున్నారు.

# 60శాతం సర్ డిజిటైజేషన్ పూర్తి

(మొదటి పేజీ తరువాయి)
తెలుసుకున్నారు. శిబిరాల వద్ద వివిధ పార్టీలకు చెందిన వారు ఉండటాన్ని గమనించి.. మీకు పార్టీ నుంచి గుర్తింపు కార్డులు ఏమైనా ఇచ్చారా? అని ప్రశ్నించారు.

సర్ గడువు పొడిగింపు తేదీని దృష్టిలో పెట్టుకొని పక్రియను కొనసాగించాలని సూచించారు. ఇప్పటికే గ్రామీణ ప్రాంతాల్లో 80 శాతం, పట్టణ ప్రాంతాల్లో 45 శాతం అయిందని తెలిపారు. పీఎల్వో, బీఎల్వోల సహకారంతో సర్ పక్రియ కొనసాగుతోందన్నారు. ఎన్యూమరేషన్ పత్రాలు అందకపోతే.. సూపర్ వైజర్‌లను అడిగి తీసుకోవాలన్నారు.

# నీటి సంపులో దూకి తల్లీ బిడ్డల ఆత్మహత్య

**తొలి అక్షరం/హైదరాబాద్, జూలై 17 :** నాగర్‌కర్నూల్ జిల్లాలో విషాదం చోటుచేసుకుంది. ఇద్దరు పిల్లలతో కలిసి తల్లి ఆత్మహత్యకు పాల్పడింది. వెల్దండ మండలం పోతేపల్లిలో ఈ ఘటన జరిగింది. ఎనుముల శిరీష (23) తమ ఇంటి ఆవరణలో ఉన్న నీటి సంపులో కుమార్తె మానశ్రీ (3), కుమారుడు వర్షిత్ (4 నెలలు)ను పడేసి.. ఆపై తానూ అందులోకి దూకేసింది. ఇంట్లో ఎవరూ లేని సమయంలో పిల్లలతో కలిసి శిరీష బలవన్మరణానికి పాల్పడింది. పోలీసులు ఘటనాస్థలికి చేరుకుని పరిశీలించారు. కుటుంబ కలహాలే ఈ ఘటనకు కారణంగా తెలుస్తోంది.

# హాస్టల్స్ హటావో 14వ వార్డ్ బచావో

● చౌటుప్పల్ మున్సిపల్ కమిషనర్‌కు కాలనీ వాసుల వినతి



తొలి అక్షరం/చౌటుప్పల్,జూలై 17: చౌటుప్పల్ మున్సిపాలిటీ పరిధిలోని 14వ వార్డు కౌండిన్య నగర్, విశ్వకర్మ కాలనీ వాసులు తమ ప్రాంతంలో నిర్వహిస్తున్న కొన్ని మహిళల హాస్టళ్ల కారణంగా స్థానికులకు వివిధ ఇబ్బందులు ఎదురవుతున్నాయని పేర్కొంటూ శుక్రవారం మున్సిపల్ కమిషనర్‌కు లిఖితపూర్వక ఫిర్యాదు చేశారు.కాలనీ వాసుల కథనం ప్రకారం, రాత్రి వేళల్లో అధిక రాకపోకలు, ద్విచక్ర వాహనాలపై వేగంగా సంచరించడం, బహిరంగ ప్రదేశాల్లో గుంపులుగా చేరడం వంటి పరిస్థితుల వల్ల మహిళలు, వృద్ధులు, చిన్నపిల్లలు మరియు స్థానిక కుటుంబాలు అసౌకర్యానికి గురవుతున్నాయని తెలిపారు. దీంతో కాలనీలో ప్రశాంత వాతావరణం దెబ్బతింటోందని వారు ఆందోళన వ్యక్తం చేశారు.ఈ నేపథ్యంలో సంబంధిత హాస్టళ్లు అన్ని చట్టబద్ధమైన అనుమతులు, భవన నిబంధనలు మరియు ఇతర ప్రభుత్వ నిబంధనలను పాటిస్తూ నిర్వహించబడుతున్నాయా అనే అంశంపై సమగ్ర విచారణ చేపట్టాలని మున్సిపల్ కమిషనర్‌ను కోరారు. నిబంధనలకు విరుద్ధంగా ఏవైనా నిర్వహణ జరుగుతున్నట్లు తేలితే చట్టపరమైన చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.అలాగే, కాలనీలో ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా పోలీసు శాఖతో సమన్వయం చేసుకుని రాత్రి వేళల్లో నిఘా పెంచాలని, ప్రజల భద్రతకు ప్రాధాన్యత ఇవ్వాలని కోరారు.తమ కాలనీలో శాంతి, భద్రత, ప్రశాంత వాతావరణం కొనసాగేందుకు అధికారులు సమస్యను అత్యంత ప్రాధాన్యతతో పరిగణించి తక్షణ చర్యలు తీసుకోవాలని 14వ వార్డు కౌండిన్య నగర్, విశ్వకర్మ కాలనీ వాసులు విజ్ఞప్తి చేశారు.

# హెల్మెట్ పెట్టుకోండి... ప్రాణాలను కాపాడుకోండి

## ట్రినిటీ హై స్కూల్‌లో రోడ్డు భద్రత అవగాహన సదస్సు

## ముఖ్యఅతిథిగా చౌటుప్పల్ ట్రాఫిక్ సిఐ నందగిరి వెంకటేశం

తొలి అక్షరం/చౌటుప్పల్,జూలై 17: చౌటుప్పల్ మున్సిపాలిటీ పరిధిలోని ట్రినిటీ హై స్కూల్‌లో శుక్రవారం రోడ్డు భద్రతపై అవగాహన సదస్సు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా చౌటుప్పల్ ట్రాఫిక్ సీఐ నందగిరి వెంకటేశం హాజరై విద్యార్థులకు ట్రాఫిక్ నిబంధనలపై సమగ్ర అవగాహన కల్పించారు.ట్రాఫిక్ సీఐ నందగిరి వెంకటేశం మాట్లాడుతూ, "హెల్మెట్ పెట్టుకోండి... ప్రాణాలను కాపాడుకోండి" అనే సందేశాన్ని ప్రతి ఒక్కరూ ఆచరణలో పెట్టాలని సూచించారు. రోడ్డు భద్రత ప్రతి పౌరుడి బాధ్యత అని, విద్యార్థులు ట్రాఫిక్ నియమాలను తెలుసుకుని తమ కుటుంబ సభ్యులకు కూడా తెలియజేయాలని పిలుపునిచ్చారు.విద్యార్థులకు ముఖ్యమైన ట్రాఫిక్ నియమాలను వివరిస్తూ, హెల్మెట్ లేకుండా ద్విచక్ర వాహనం నడపకూడదని, వాహనం నడుపుతూ మొబైల్ ఫోన్ మాట్లాడకూడదని, మద్యం సేవించి వాహనం నడపడం చట్టరీత్యా నేరమని తెలిపారు. అలాగే ట్రాఫిక్ సిగ్నల్స్‌ను తప్పనిసరిగా పాటించాలని,



త్రిపుల్ రైడింగ్ చేయరాదని, మలుపులు తిరిగే సమయంలో ఇండికేటర్లను వినియోగించాలని, నో పార్కింగ్ ప్రాంతాల్లో వాహనాలను నిలపవద్దని సూచించారు. రోడ్డు దాటే సమయంలో ట్రాఫిక్ సంకేతాలను గమనించి సురక్షితంగా వ్యవహరించాలని విద్యార్థులకు వివరించారు.అనంతరం విద్యార్థుల చేత ట్రాఫిక్ నిబంధనలను తప్పకుండా పాటిస్తామని ప్రతిజ్ఞ చేయించారు.

ట్రినిటీ హై స్కూల్ చైర్మన్ కేవీబీ కృష్ణారావు, ప్రిన్సిపాల్ & డైరెక్టర్ డాక్టర్ ఉజ్జిని మంజుల, ట్రాఫిక్ ఎస్ఐ జి. సైదిరెడ్డి, ఆర్ఎస్ఐ ఆంజనేయులు, ఏఎస్ఐ జంగయ్య, ట్రాఫిక్ సిబ్బంది, ఉపాధ్యాయులు, ఉపాధ్యాయినులు, విద్యార్థులు పాల్గొన్నారు.సదస్సు అనంతరం ప్రిన్సిపాల్ డాక్టర్ ఉజ్జిని మంజుల మాట్లాడుతూ, విద్యార్థుల భవిష్యత్ భద్రత దృష్ట్యా విలువైన సమయాన్ని





కేటాయించి ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కల్పించిన ట్రాఫిక్ సీఐ నందగిరి వెంకటేశం గారికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేస్తూ ఘనంగా సన్మానించారు. కార్యక్రమం విద్యార్థుల్లో రోడ్డు భద్రతపై చైతన్యం పెంపొందించడంలో ఎంతో ఉపయోగకరంగా నిలిచిందని పేర్కొన్నారు.

# యూరియా యాప్‌తో రైతులకు చుక్కలు చూపిస్తున్న ప్రభుత్వం

● రైతులను ఇబ్బందులకు గురిచేస్తున్న యాప్‌ను వెంటనే సరిచేయాలి

● ఢిల్లీ మాధవరెడ్డి బిఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు చౌటుప్పల్ మండలం



తొలి అక్షరం/చౌటుప్పల్ జులై 17: రాష్ట్ర ప్రభుత్వం యూరియా ఎరువుల పంపిణీ కోసం ప్రవేశపెట్టిన యాప్ రైతులకు తీవ్ర ఇబ్బందులను కలిగిస్తోందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. యాప్‌లో తరచూ సర్వర్ డౌన్, నో స్టాక్, ఎర్రర్, జిల్లా వివరాలు కనిపించకపోవడం, మొబైల్ నంబర్ లింక్ కాలేదని చూపించడం వంటి సమస్యలు రావడంతో రైతులు గంటల తరబడి ప్రయత్నించినా బుకింగ్ చేసుకోలేకపోతున్నారు.ఒక్క యూరియా బస్తా కోసం రైతులు మొబైల్‌లతో అష్టకష్టాలు పడాల్సిన పరిస్థితి నెలకొందని విమర్శలు వ్యక్తమవుతున్నాయి. వ్యవసాయ పనులు అత్యవసరంగా ఉన్న ఈ సమయంలో సాంకేతిక సమస్యల కారణంగా రైతులు తీవ్ర ఆందోళనకు గురవుతున్నారు.యాప్‌ను సక్రమంగా పరీక్షించకుండా అమల్లోకి తీసుకురావడం వల్ల రైతులే ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పలువురు రైతులు ఆరోపిస్తున్నారు. ప్రభుత్వం వెంటనే స్పందించి యాప్‌లోని సాంకేతిక లోపాలను పూర్తిగా పరిష్కరించాలని, సర్వర్ సామర్థ్యాన్ని పెంచాలని, రైతులకు ఎలాంటి ఆటంకాలు లేకుండా యూరియా అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేస్తున్నారు.రైతు పంటను కాపాడాల్సిన ప్రభుత్వం, యూరియా కోసం రైతులు ఇబ్బందులు పడకుండా తక్షణమే ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసి సమస్యను పరిష్కరించాలని రైతులు కోరుతున్నారు.

# చౌటుప్పల్ ప్రభుత్వ 100 పడకల ఆసుపత్రి నిర్మాణాన్ని వెంటనే పూర్తి చేయాలి

## బూరుగు కృష్ణారెడ్డి, సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు

తొలి అక్షరం/చౌటుప్పల్, జూలై 17: చౌటుప్పల్ మున్సిపాలిటీ పరిధిలో నిర్మాణంలో ఉన్న ప్రభుత్వ 100 పడకల ఆసుపత్రి పనులను వెంటనే పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు బూరుగు కృష్ణారెడ్డి రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సిపిఎం చౌటుప్పల్ పట్టణ కమిటీ ఆధ్వర్యంలో ప్రభుత్వ ఆసుపత్రి నిర్మాణ పనులను పరిశీలించిన అనంతరం అక్కడే నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా బూరుగు కృష్ణారెడ్డి మాట్లాడుతూ, గత ప్రభుత్వం ప్రజల ఆరోగ్య అవసరాలను దృష్టిలో ఉంచుకుని ఎంతో ప్రతిష్ఠాత్మకంగా ఈ 100 పడకల ప్రభుత్వ ఆసుపత్రికి శంకుస్థాపన చేసినప్పటికీ, నిర్మాణ పనులు సంవత్సరాలుగా నత్తనడకన సాగుతూ ఇప్పటికీ పూర్తికాకపోవడం ప్రభుత్వ నిర్లక్ష్యానికి నిదర్శనమని



విమర్శించారు. చౌటుప్పల్ ఆరు మండలాలకు కేంద్రంగా ఉండటంతో పాటు జాతీయ రహదారిపై కీలక ప్రాంతంగా ఉన్నందున ప్రతిరోజూ అనేక రోడ్డు ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయని తెలిపారు. ప్రమాదాల సమయంలో బాధితులకు తక్షణ అత్యవసర వైద్య సేవలు అందించేందుకు ఆధునిక సౌకర్యాలతో కూడిన 100 పడకల ప్రభుత్వ ఆసుపత్రి అత్యంత అవసరమని పేర్కొన్నారు. ఆసుపత్రి నిర్మాణం ఆలస్యం కావడం వల్ల ప్రమాద బాధితులు, గర్భిణీలు, పేద ప్రజలు, అత్యవసర చికిత్స అవసరమైన రోగులు హైదరాబాదు లేదా ప్రైవేటు ఆసుపత్రులను ఆశ్రయించాల్సి వస్తోందని, దీంతో లక్షల రూపాయల వైద్య ఖర్చు భరించలేక అనేక కుటుంబాలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు.ప్రభుత్వం వెంటనే అవసరమైన నిధులు విడుదల చేసి నిర్మాణ పనులను యుద్ధప్రాతిపదికన పూర్తి చేయాలని, ఆసుపత్రికి అవసరమైన ఆధునిక వైద్య పరికరాలు, ఐసీయూ, అత్యవసర విభాగం, ప్రసూతి విభాగం తదితర సౌకర్యాలను కల్పించాలని, తగిన సంఖ్యలో వైద్యులు, నిపుణులు, నర్సులు, పారామెడికల్ సిబ్బందిని నియమించి ఆసుపత్రిని వెంటనే ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని ఆయన డిమాండ్ చేశారు.ప్రజల ఆరోగ్యంతో ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరించడం ఏమాత్రం సమంజసం కాదని, ప్రజలకు హామీ ఇచ్చిన ఆసుపత్రిని త్వరితగతిన పూర్తి చేసి ప్రారంభించాలని కోరారు. లేనిపక్షంలో సిపిఎం ఆధ్వర్యంలో ప్రజలను, ప్రజాసంఘాలను కలుపుకుని పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు నిర్వహిస్తామని, ప్రభుత్వ వైఖరిని ప్రజల్లో ఎండగడతామని బూరుగు కృష్ణారెడ్డి హెచ్చరించారు.

# ఎస్. లింగోటం గ్రామంలో సీసీటీవీ కెమెరాల ఏర్పాటు పై అవగాహన కార్యక్రమం




తొలి అక్షరం/చౌటుప్పల్,జూలై 17:జిల్లా ఎస్పీ గారి ఆదేశాల మేరకు చౌటుప్పల్ పోలీస్ స్టేషన్ ఇన్‌స్పెక్టర్ జి. మన్మథ కుమార్, ఎస్ఐ యాదగిరి గారు మరియు పోలీసు సిబ్బంది కలిసి ఎస్. లింగోటం గ్రామాన్ని సందర్శించి గ్రామంలో సీసీటీవీ కెమెరాల ప్రాముఖ్యతపై విస్తృత అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు.ఈ సందర్భంగా గ్రామంలోని కిరాణా దుకాణాలు, హోటళ్లు, ఇతర వ్యాపార సంస్థలను సందర్శించి, నేరాల నివారణ, నేరస్థుల గుర్తింపు, ప్రజల భద్రత, ఆస్తుల రక్షణలో సీసీటీవీ కెమెరాల పాత్ర ఎంతో కీలకమని వివరించారు. ప్రతి వ్యాపార సంస్థ తమ పరిసరాల్లో నాణ్యమైన సీసీటీవీ కెమెరాలను ఏర్పాటు చేసుకోవాలని సూచించారు.ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్, ఉప సర్పంచ్, గ్రామ పెద్దలు, కిరాణా దుకాణాలు, హోటళ్లు మరియు ఇతర వ్యాపార సంస్థల యజమానులు పాల్గొన్నారు. కార్యక్రమం అనంతరం గ్రామంలోని ప్రధాన కూడళ్లు, ప్రభుత్వ కార్యాలయాల పరిసరాలు మరియు అవసరమైన ఇతర ప్రాంతాల్లో వీలైనంత త్వరగా సీసీటీవీ కెమెరాలను ఏర్పాటు చేయడానికి చర్యలు తీసుకుంటామని గ్రామ సర్పంచ్, ఉప సర్పంచ్ మరియు గ్రామ పెద్దలు పోలీసు అధికారులకు హామీ ఇచ్చారు.ప్రజల భాగస్వామ్యంతో గ్రామాల్లో సీసీటీవీ వ్యవస్థను విస్తృతంగా ఏర్పాటు చేయడం ద్వారా నేరాలను సమర్థవంతంగా అరికట్టడంతో పాటు శాంతిభద్రతలను మరింత బలోపేతం చేయవచ్చని ఈ సందర్భంగా పోలీసులు తెలిపారు.



# ప్రపంచ యువ నైపుణ్య దినోత్సవం సందర్భంగా ఉచిత నైపుణ్య శిక్షణ, ప్లేస్‌మెంట్ అవకాశాలపై అవగాహన

తొలి అక్షరం/షాద్ నగర్, జులై 17: ప్రపంచ యువ నైపుణ్య దినోత్సవాన్ని పురస్కరించుకుని షాద్‌నగర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో వాణిజ్యశాఖ ఆధ్వర్యంలో, ప్రథమ్ ఎడ్యుకేషన్ ఫౌండేషన్ సహకారంతో ఉచిత నైపుణ్య శిక్షణ, ఉద్యోగ అవకాశాలపై అవగాహన కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు.ఈ సందర్భంగా నిర్వాహకులు మాట్లాడుతూ, డిగ్రీ పూర్తి చేసిన యువత ఉద్యోగాలను సాధించాలంటే విద్యతో పాటు ప్రాక్టికల్ నైపుణ్యాలను పెంపొందించుకోవడం ఎంతో అవసరమని తెలిపారు. ఇందుకోసం ఫుడ్ ప్రొడక్షన్, కంప్యూటర్ ఆపరేటర్, ఫుడ్ అండ్ బెవరేజ్ సర్వీసెస్, హౌస్‌కీపింగ్ రంగాల్లో ఉచిత శిక్షణ



అందిస్తున్నట్లు వివరించారు. శిక్షణ కాలంలో ఉచిత వసతి, భోజన సౌకర్యాలతో పాటు శిక్షణ అనంతరం ప్రముఖ సంస్థల్లో ఉద్యోగ అవకాశాలు కూడా కల్పిస్తామని తెలిపారు.ఈ శిక్షణ పొంది ప్రస్తుతం హైదరాబాద్‌లోని ప్రముఖ హోటళ్లలో ఉద్యోగాలు చేస్తున్న ప్రభుత్వ డిగ్రీ కళాశాల పూర్వ విద్యార్థులు కార్యక్రమంలో పాల్గొని తమ అనుభవాలను పంచుకున్నారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని నైపుణ్యాలను పెంపొందించుకుని మంచి ఉద్యోగాలు సాధించాలని ప్రస్తుత విద్యార్థులను ప్రోత్సహించారు.ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కమల, వైస్ ప్రిన్సిపల్ పి. శ్రీనివాసులు, డాక్టర్ రవి ప్రసాద్, డాక్టర్ జయ కాగడ, శాంతి, విజయ జ్యోతి, డాక్టర్ దేవయ్య, కే. అనురాధ, బి. యాదయ్య తదితర అధ్యాపకులు పాల్గొన్నారు.

# అమరవీరుల స్థూపం ఆవిష్కరణను విజయవంతం చేద్దాం

## తెలంగాణ ఉద్యమకారుల ఐక్య వేదిక

తొలి అక్షరం/షాద్ నగర్, జులై 17: షాద్‌నగర్ ఎంపీడీఓ కార్యాలయ ఆవరణలో స్థానిక ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ సొంత నిధులతో నిర్మించిన తెలంగాణ అమరవీరుల స్థూపాన్ని జూలై 19న ఆవిష్కరించడం అభినందనీయమని తెలంగాణ ఉద్యమకారుల ఐక్య వేదిక (టీయూ జేఏసీ) నాయకులు పేర్కొన్నారు. ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయడానికి ఉద్యమకారులు, ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొనాలని పిలుపునిచ్చారు. శుక్రవారం షాద్‌నగర్ పెన్షనర్స్ భవన్‌లో టీజీ శ్రీనివాస్ అధ్యక్షతన తెలంగాణ ఉద్యమకారుల ఐక్య వేదిక (టీయూ జేఏసీ) డివిజన్ కమిటీ విస్తృత స్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో రాష్ట్ర ప్రభుత్వం తెలంగాణ ఉద్యమకారుల గుర్తింపు కోసం ప్రత్యేక కమిటీ ఏర్పాటు చేయడాన్ని స్వాగతిస్తూ హర్షం వ్యక్తం చేశారు. నిజమైన ఉద్యమకారులకు న్యాయం జరిగేలా కమిటీ



పారదర్శకంగా పనిచేయాలని తీర్మానించారు. అదేవిధంగా ప్రొఫెసర్ కె. జయశంకర్‌ను తెలంగాణ జాతిపితగా అధికారికంగా ప్రకటించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరుతూ సమావేశంలో ఏకగ్రీవంగా తీర్మానం చేశారు.స్థానిక ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ సొంత ఖర్చులతో నిర్మించిన తెలంగాణ అమరవీరుల స్థూపం ఆవిష్కరణ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని, తెలంగాణ ఉద్యమకారులు అధిక సంఖ్యలో హాజరై అమరవీరులకు ఘన నివాళులు అర్పించాలని సమావేశంలో పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో టీయూ జేఏసీ సలహాదారులు వంగూరి గంగిరెడ్డి, రాంబల్ నాయక్, పంది వెంకట్రాంరెడ్డి, నక్కల వెంకటేష్ గౌడ్, రామారావు, అబ్దుల్ రబ్ జామి, గౌరవ అధ్యక్షులు పినపాక ప్రభాకర్, అధ్యక్షులు టీజీ శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి శ్రీధర్ రెడ్డి, కోశాధికారి కే. వంశీకృష్ణ, నాయకులు నందిగామ సురేష్, అర్జునప్ప, సిరాజ్, సురేష్ రెడ్డి, వెంకట్, బాలు నాయక్, బాబూరావు, రాజా వరప్రసాద్, మేకల వెంకటేష్, ఆర్ల యాదయ్య, రాఘవేంద్ర రెడ్డి, అశోక్ రెడ్డి, రతన్ నాయక్, బుద్దుల జంగయ్య పాల్గొన్నారు.

# “వైన్స్‌లకు అనుమతి మీరే... ముంగిట తనిఖీలు కూడా మీరేనా?“

**తొలి అక్షరం/చౌటుప్పల్,జూలై 17:** మునుగోడు నియోజకవర్గం చౌటుప్పల్ మున్సిపాలిటీలో వైన్స్ దుకాణాల నిర్వహణ విషయంలో ప్రభుత్వం, స్థానిక ప్రజాప్రతినిధుల వైఖరిపై ప్రజల్లో తీవ్ర అయోమయం నెలకొన్నదని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి వైన్స్ దుకాణాలు మధ్యాహ్నం వరకు తెరవవద్దని చెబుతున్నప్పటికీ, వాస్తవ పరిస్థితుల్లో అలాంటి ఆదేశాలు అమలు కావడం లేదని ఆరోపిస్తున్నారు. మరోవైపు వైన్స్ దుకాణాల వద్ద పోలీసులు తనిఖీలు నిర్వహించడం వల్ల వ్యాపారులు, వినియోగదారులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నార ని పేర్కొంటున్నారు.ప్రభుత్వం వైన్స్ దుకాణాలకు




చట్టబద్ధంగా అనుమతులు ఇస్తే, అదే ప్రభుత్వం పోలీసులతో వాటి ముందు తనిఖీలు నిర్వహించడం ఏ విధమైన విధానమని ప్రశ్నిస్తున్నారు. ఒకవైపు అనుమతులు ఇచ్చి, మరోవైపు ఇబ్బందులకు గురిచేయడం వల్ల ప్రజల్లో గందరగోళం




ఏర్పడుతోందని విమర్శించారు.ప్రభుత్వం, సంబంధిత అధికారులు స్పష్టమైన విధానాన్ని ప్రకటించి,ఒకే నిబంధనను అమలు చేయాలని కోరుతున్నారు. ప్రజలను, వ్యాపారులను అయోమయానికి గురిచేసే చర్యలకు స్వస్తి పలికి, పారదర్శకంగా వ్యవహరించాలని ఈ సందర్భంగా డిమాండ్ చేశారు.

# చౌటుప్పల్‌లో ప్రైవేట్ పాఠశాలల విద్యా వ్యాపారాన్ని ఖండిస్తున్నాం

**● గంగాదేవి శివ బి ఆర్ ఎస్ వి నాయకులు చౌటుప్పల్ ● అనుమతులు లేని పాఠశాలలను సీజ్ చేసి, విద్యార్థులకు మౌలిక వసతులు కల్పించాలి**



**తొలి అక్షరం/చౌటుప్పల్ జూలై 17:** చౌటుప్పల్ పట్టణంలో కొన్ని ప్రైవేట్ పాఠశాలలు విద్యను సేవగా కాకుండా వ్యాపారంగా మార్చుతున్న తీరు అత్యంత ఆందోళనకరమని బి ఆర్ ఎస్ వి చౌటుప్పల్ మండల నాయకులు గంగాదేవి శివ అన్నారు.అనుమతులు లేకుండా నిర్వహిస్తున్న పాఠశాలలపై అధికారులు వెంటనే చర్యలు తీసుకుని, అవసరమైతే అలాంటి పాఠశాలలను సీజ్ చేయాలని ఆయన డిమాండ్ చేశారు. విద్యార్థులకు అవసరమైన తరగతి గదులు, తాగునీరు, మరుగుదొడ్లు, భద్రతా చర్యలు మరియు ఇతర మౌలిక సదుపాయాలు లేకపోయినా కొన్ని పాఠశాలలు కార్యకలాపాలు కొనసాగించడం దురదృష్టకరమన్నారు.జిల్లా కలెక్టర్, జిల్లా విద్యాశాఖ అధికారి, మండల విద్యాశాఖ అధికారిలు ఈ అంశంపై తక్షణమే సమగ్ర తనిఖీలు నిర్వహించి, నిబంధనలు ఉల్లంఘిస్తున్న పాఠశాలలపై కఠిన చర్యలు తీసుకోవాలని గంగాదేవి శివ కోరారు.విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని ప్రైవేట్ పాఠశాలలు ప్రభుత్వ నిబంధనలకు అనుగుణంగా అన్ని మౌలిక వసతులు కల్పించి, పారదర్శకంగా విద్యా సేవలు అందించాల్సిన అవసరం ఉందన్నారు.అధికారులు ఈ విషయాన్ని నిర్లక్ష్యం చేస్తే, అన్ని విద్యా సంఘాలతో కలిసి తీవ్రంగా నిరసన వ్యక్తం చేస్తామని గంగాదేవి శివ హెచ్చరించారు.

# షాద్‌నగర్‌లో మరో చారిత్రక ఘట్టం

**ఈనెల 19న తెలంగాణ అమరవీరుల స్థూపం, మహనీయుల విగ్రహాల ఆవిష్కరణ**

**తెలంగాణ ఉద్యమకారులు, ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలి: టీజేఏసీ చైర్మన్ మూలె జనార్ధన్**

**తొలి అక్షరం/షాద్ నగర్, జూలై 17:** రంగారెడ్డి జిల్లా ఫరూక్‌నగర్ మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో ఈనెల 19వ తేదీ ఆదివారం ఉదయం 9:30 గంటలకు తెలంగాణ అమరవీరుల స్థూపం, మహనీయుల విగ్రహాల ఆవిష్కరణ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహిస్తున్నట్లు తెలంగాణ జాయింట్ యాక్షన్ కమిటీ (టీజేఏసీ) షాద్‌నగర్ తాలూకా కమిటీ వెల్లడించింది. ఈ కార్యక్రమాన్ని స్థానిక ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ సహాయ సహకారాలతో నిర్వహిస్తున్నట్లు టీజేఏసీ నాయకులు తెలిపారు. ఈ సందర్భంగా టీజేఏసీ చైర్మన్ మూలె జనార్ధన్ మాట్లాడుతూ, తెలంగాణ రాష్ట్ర సాధన కోసం ప్రాణత్యాగం చేసిన అమరవీరుల త్యాగాలను



భావితరాలకు చాటిచెప్పే చిరస్మరణీయ చిహ్నంగా ఈ అమరవీరుల స్థూపం నిలుస్తుందని అన్నారు. అలాగే తెలంగాణ ఉద్యమానికి, సమాజాభివృద్ధికి విశేష సేవలందించిన మహనీయుల విగ్రహాల ఆవిష్కరణ కూడా చారిత్రాత్మక ఘట్టమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా స్థానిక ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్, రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు, ఎమ్మెల్సీ, తెలంగాణ రాష్ట్ర జేఏసీ వ్యవస్థాపకులు ప్రొఫెసర్ కోదండరాం, విద్యా పరిరక్షణ కమిటీ ప్రధాన కార్యదర్శి ప్రొఫెసర్ హరగోపాల్, రాష్ట్ర సాంస్కృతిక శాఖ చైర్‌పర్సన్ శ్రీమతి వెన్నెల గద్దర్, రాష్ట్ర మహిళా కమిషన్ సభ్యురాలు శ్రీమతి శంకరమ్మ, షాద్‌నగర్ మాజీ ఎమ్మెల్యే ఎల్లనమోని అంజయ్య యాదవ్, భీశ్వ కిష్టయ్య, చౌలపల్లి ప్రతాప్‌రెడ్డి, బీజేపీ రాష్ట్ర నాయకులు నెల్లి శ్రీవర్ధన్ రెడ్డి తదితర ప్రముఖులు హాజరవుతారని తెలిపారు. తెలంగాణ ఉద్యమకారులు, అన్ని రాజకీయ పార్టీల నాయకులు, విద్యావంతులు, మేధావులు, తెలంగాణవాదులు, విద్యార్థులు, ప్రజాప్రతినిధులు, ప్రజలు అధిక సంఖ్యలో హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని మూలె జనార్ధన్ పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో టీజేఏసీ వైస్ చైర్మన్, మార్కెట్ కమిటీ డైరెక్టర్ కరుణాకర్, గ్రంథాలయ కమిటీ వైస్ చైర్మన్, జేఏసీ కన్వీనర్ నక్క బాల్‌రాజ్ యాదవ్, ట్రెజరర్ గోర్ల రాము, మందారం నరసింహులు, భీశ్వ కృష్ణయ్య, అర్జునప్ప, మున్సిపల్ చైర్మన్ అగ్గనూర్ బసవేశ్వర్, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ మహ్మద్ అలీ ఖాన్ బాబర్, ఆదివాసీ గిరిజన రాష్ట్ర నాయకులు పి. రఘునాయక్, బాదేపల్లి సిద్ధార్థ, జాంగారి రవి, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ట్రైకార్ మెగా స్కిల్ సెంటర్ అవగాహన కార్యక్రమం






**తొలి అక్షరం/షాద్ నగర్, జూలై 17:** షాద్‌నగర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో అబ్దుల్లాపూర్‌మెట్ ట్రైకార్ మెగా స్కిల్ సెంటర్ ఆధ్వర్యంలో స్కిల్ డెవలప్‌మెంట్ కోర్సులు, ప్లేస్‌మెంట్ అవకాశాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ట్రైనర్ సాయి మాట్లాడుతూ 18 నుంచి 35 సంవత్సరాల మధ్య వయస్సు గల యువత, ముఖ్యంగా ఎస్సీ, ఎస్టీ విద్యార్థులకు జూనియర్ సాఫ్ట్‌వేర్ డెవలపర్, సీఆర్ఎం, వేర్‌హౌస్ సూపర్వైజర్, వేర్‌హౌస్ అసోసియేట్, టెలికాం కస్టమర్ కేర్ ఎగ్జిక్యూటివ్, హ్యాండ్ ఎంబ్రాయిడరీ, టైలరింగ్, బ్యూటీ థెరపిస్ట్ వంటి కోర్సుల్లో ఉచిత శిక్షణ అందిస్తున్నట్లు తెలిపారు.శిక్షణతో పాటు ఉచిత వసతి, భోజనం, అనంతరం ప్లేస్‌మెంట్ సౌకర్యం కూడా కల్పిస్తామని ఆయన వివరించారు. విద్యార్థులు తమ సందేహాలను ట్రైనర్లను అడిగి నివృత్తి చేసుకున్నారు.ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఎల్. కమల, ప్లేస్‌మెంట్ సెల్ కన్వీనర్ డాక్టర్ పి. సత్యనారాయణ, కెమిస్ట్రీ విభాగాధిపతి విజయజ్యోతి, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.అనంతరం డిగ్రీ ప్రవేశాలకు సంబంధించిన దోస్త్ స్పెషల్ ఫేజ్ నోటిఫికేషన్ విడుదలైందని ప్రిన్సిపల్ డాక్టర్ ఎల్. కమల, దోస్త్ కోఆర్డినేటర్ పి. శ్రీనివాసులు తెలిపారు. జూలై 20 నుంచి 26 వరకు దరఖాస్తులు స్వీకరిస్తామని, డిగ్రీ చదవాలనుకునే విద్యార్థులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని సూచించారు.

# నీట్ ఫలితాల్లో మరోసారి అగ్రగామిగా నిలిచిన రేసోమెడికాన్

**తొలి అక్షరం/ హన్మకొండ ప్రతినిధి:** ఎన్‌టీఏ తాజాగా విడుదల చేసిన నీట్-2026 ఫలితాల్లో హనుమకొండలోని రేసో మెడికాన్ జూనియర్ కళాశాల విద్యార్థులు మరోసారి అద్భుతమైన ప్రతిభను కనబరిచారని సంస్థ చైర్మన్ లెక్కల రాజిరెడ్డి హర్షం వ్యక్తం చేశారు.ప్రతి సంవత్సరం మాదిరిగానే ఈ ఏడాది కూడా నీట్-2026 పరీక్షకు హాజరైన రేసో మెడికాన్ విద్యార్థుల్లో అత్యధిక శాతం మంది ఫ్రీ మెడికల్ సీట్లు సాధించే స్థాయిలో ఉత్తమ మార్కులు సాధించారని,పలువురు విద్యార్థులు ప్రతిష్టాత్మక ప్రభుత్వ,ప్రముఖ మెడికల్ కళాశాలల్లో ప్రవేశాలు పొందనున్నారని లెక్కల రాజిరెడ్డి తెలిపారు.అత్యుత్తమ మార్కులు సాధించిన విద్యార్థులలో కే.శ్యాం కరన్(హెచ్ టి 260410321709)655 మార్కులు,పి.గురురాజ్ రెడ్డి(260410427973) 630మార్కులు,బి.కోమల్(260410487173) 591మార్కులు,బి.అభిషేక్(260410168368)580 మార్కులు,సి హెచ్.సాక్షి(260410877926)546 మార్కులు,మహమ్మద్ అద్నాన్(260 410439933)528 మార్కులు,ఎన్. మణిదీప్(2604100716 14)528




మార్కులు,వేముల జస్విన్ ప్రీత్(2604103 99249)500 మార్కులు సాధించారు. ఈ సందర్భంగా చైర్మన్ రాజిరెడ్డి మాట్లాడుతూ...వరంగల్,హనుమకొండ జిల్లాల్లో ఎక్కడా లేని విధంగా అత్యుత్తమ వసతులతో ప్రత్యేకంగా బై.పి.సి. విద్యార్థుల కొరకు మొట్టమొదటి సారిగా బై.పి.సి.+ ప్రత్యేక నీట్ కోచింగ్ క్యాంపస్ స్థాపించి నీట్ శిక్షణను నిర్వహిస్తున్నామని,జాతీయ స్థాయి అనుభవం కలిగిన ఉపాధ్యాయులను నియమించి నిరంతరము మేనేజ్‌మెంట్ పర్యవేక్షణలో ప్రతి విద్యార్థికి వ్యక్తిగత శ్రద్ధతో బోధించడం వలన ప్రతి సంవత్సరం అద్భుతమైన విజయాలను సాధించడము సాధ్యమైతుందని తెలుపుతూ ఈ అవకాశాన్ని మన జిల్లాల తల్లితండ్రులు విద్యార్థులు వినియోగించుకోవాలని కోరారు.ఈ సందర్భంగా రేసోమెడికాన్ మేనేజింగ్ డైరెక్టర్ దీప్తిరావు మాట్లాడుతూ...ఇంకా 56 మంది విద్యార్థులు 400కు పైగా మార్కులు సాధించి,ఫ్రీ మెడికల్ సీట్లు పొందే అవకాశాలను మెరుగు పరుచుకున్నారని తెలిపారు.ఈ ఘన విజయానికి కృషి చేసిన విద్యార్థులు,అధ్యాపక బృందం, తల్లిదండ్రులకు సంస్థ యాజమాన్యం హృదయపూర్వక అభినందనలు తెలియజేసింది.ఈ విజయాన్ని పురస్కరించుకుని రేసోమెడికాన్‌లో నీట్-2026 విద్యార్థుల అభినందన సభలో రేసోనెన్స్ మేనేజింగ్ డైరెక్టర్ దీప్తిరావు,ఇతర డైరెక్టర్లు లెక్కల మహేందర్ రెడ్డి,మాదిరెడ్డి దేవేందర్ రెడ్డి,సి.ఈ.ఓ.లెక్కల రమ్యారాజిరెడ్డి, ప్రిన్సిపల్,ఫ్యాకల్టీ,ర్యాంకులు సాధించిన విద్యార్థినీ విద్యార్థులు మరియు తల్లిదండ్రులు పాల్గొన్నారు.

# టిఆర్ఎస్ నాయకుని జన్మదిన కార్యక్రమంలో పాల్గొన్న మాజీ ఎంపీపీ నీల దయాకర్



**తొలి అక్షరం/రామన్నపేట జూలై 17:** రామన్నపేట మండలం దుబ్బాక గ్రామ టిఆర్ఎస్ పార్టీ గ్రామ శాఖ మాజీ అధ్యక్షులు గుండాల రాంబాబు జన్మదిన కార్యక్రమంలో మాజీ ఎంపీపీ నీల దయాకర్ పాల్గొని సాల్వతో సత్కరించి శు భాకాంక్షలు తెలియజేసినారు. ఈ కార్యక్రమంలో టిఆర్ఎస్ పార్టీ మాజీ మండలాధ్యక్షులు పోషబోయిన మల్లేశం ఉప సర్పంచ్ చొప్పరి నరసింహ వార్డ్ మెంబర్ భైరోజు పురుషోత్తం పాల సంఘం చైర్మన్ చెన్నకేశవులు నాయకులు పొనుగోటి వెంకటేశ్వరరావు ఆకుల పురుషోత్తం గుండాల యాదయ్య తదితరులు పాల్గొన్నారు

# 26వ వార్డులో నూతన బోర్ మోటార్ ప్రారంభించిన మున్సిపల్ చైర్మన్ అగ్గనూర్ బసవేశ్వర్

**- సాంబశివ కాలనీలో పార్కు మరమ్మతుల పనులను పరిశీలించిన చైర్మన్**



**తొలి అక్షరం/షాద్ నగర్, జూలై 17:** షాద్‌నగర్ పట్టణంలోని 26వ వార్డు ఆర్‌ఆర్ మోటార్స్ గల్లీలో ప్రజలకు తాగునీటి సమస్యను పరిష్కరించే ఉద్దేశ్యంతో నూతనంగా ఏర్పాటు చేసిన బోర్ మోటార్‌ను మున్సిపల్ చైర్మన్ అగ్గనూర్ బసవేశ్వర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా స్థానికులు చైర్మన్‌కు కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ మహ్మద్ అలీ ఖాన్ బాబర్‌తో కలిసి సాంబశివ కాలనీలో కొనసాగుతున్న పార్కు మరమ్మతుల పనులను పరిశీలించారు. పార్కును ప్రజలకు అనుకూలంగా తీర్చిదిద్దేలా పనులను నాణ్యతతో, వేగవంతంగా పూర్తి చేయాలని సంబంధిత అధికారులకు సూచించారు.ఈ సందర్భంగా స్థానిక 26వ వార్డు కౌన్సిలర్ ఎస్పీ శివ కాలనీలో నెలకొన్న తాగునీరు, డ్రైనేజీ, రహదారులు, వీధి దీపాలు తదితర పలు సమస్యలను మున్సిపల్ చైర్మన్ అగ్గనూర్ బసవేశ్వర్ దృష్టికి తీసుకువచ్చారు. సమస్యలను పరిశీలించిన చైర్మన్ వాటి పరిష్కారానికి అవసరమైన చర్యలు తీసుకుని ప్రజలకు మెరుగైన మౌలిక సదుపాయాలు కల్పిస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, నాయకులు, అధికారులు, కాలనీవాసులు తదితరులు పాల్గొన్నారు.

# లింరా జమ్ జమ్ హోటల్‌ను ప్రారంభించిన ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

**తొలి అక్షరం/షాద్ నగర్, జూలై 17:** షాద్‌నగర్ పట్టణంలోని హైదరాబాద్ రోడ్డులో నూతనంగా ఏర్పాటు చేసిన లింరా జమ్ జమ్ హోటల్ ప్రారంభోత్సవ కార్యక్రమానికి స్థానిక ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ ముఖ్య అతిథిగా హాజరై హోటల్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ మాట్లాడుతూ, షాద్‌నగర్ పట్టణంలో నాణ్యమైన ఆహార సేవలను అందించే లక్ష్యంతో ప్రారంభమైన లింరా జమ్ జమ్ హోటల్ యజమానులను అభినందించారు. ప్రజలకు పరిశుభ్రమైన వాతావరణంలో, నాణ్యతకు ప్రాధాన్యం ఇస్తూ రుచికరమైన భోజనాలు, వివిధ రకాల చికెన్, మటన్, బిర్యానీలు, టిఫిన్లు, ఫ్యామిలీ డైనింగ్ సౌకర్యాలతో సేవలు అందించాలని సూచించారు.ఆహార పదార్థాల తయారీలో పరిశుభ్రత, నాణ్యత, వినియోగదారుల సంతృప్తికి అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని, వినియోగదారుల నమ్మకాన్ని సంపాదించుకుంటే వ్యాపారం మరింత అభివృద్ధి చెందుతుందని పేర్కొన్నారు. స్థానిక ప్రజలకు ఉత్తమమైన రుచితో పాటు మంచి సేవలు అందించే కేంద్రంగా ఈ హోటల్ గుర్తింపు పొందాలని ఆకాంక్షించారు. హోటల్



యాజమాన్యానికి ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ శుభాకాంక్షలు తెలియజేస్తూ, వ్యాపారంలో మరింత అభివృద్ధి సాధించి విజయవంతంగా ముందుకు సాగాలని ఆకాంక్షించారు.ప్రజాప్రతినిధులు, స్థానిక నాయకులు, హోటల్ యాజమాన్యం, వ్యాపారవేత్తలు, అభిమానులు మరియు పలువురు పట్టణ ప్రజలు పాల్గొన్నారు.

## వడ్డెకొత్తపెల్లిలో ఘనంగా మాజీ మంత్రి నెమరుగోమ్ముల

# యతీరాజారావు జయంతి వేడుకలు

**• యతి రాజారావు సేవలు మరువలేనివి • మాజీ జడ్పీ ఫ్లోర్ లీడర్ నెమరుగోమ్ముల ప్రవీణ్ రావు,**

**తొలి అక్షరం/పెద్దవంగర జులై 17:** దివంగత మాజీ మంత్రి చెన్నూరు టైగర్ నెమరుగొమ్ముల యతిరాజారావు 96వ జయంతి వేడుకలను అభిమానులు ఘనంగా నిర్వహించారు. పెద్ద వంగర మండలంలో మాజీ మంత్రి స్వగ్రామమైన వడ్డె కొత్తపల్లి గ్రామంలో యతిరాజారావు కుమారుడు ప్రవీణ్ రావు ఆధ్వర్యంలో ఆయన విగ్రహానికి పూలమాలవేసి అభిమానులతో కలిసి జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పండ్లు స్వీట్లు పంపిణీ చేశారు అనంతరం ప్రవీణ్ రావు మాట్లాడుతూరాజకీయాల్లో నాయకులు ఎందరో వస్తారు, పోతారు. పదవులు పొందిన వారు కూడా చాలామందే ఉంటారు. కానీ పదవులకు గౌరవం తీసుకొచ్చిన నాయకులు మాత్రం అరుదుగా కనిపిస్తారు. అలాంటి అరుదైన ప్రజానాయకుల్లో నెమురుగొమ్ముల యతిరాజారావు పేరు ఎప్పటికీ ప్రత్యేకంగానే నిలుస్తుంది. ప్రజాప్రతినిధిగా, రాష్ట్ర మంత్రిగా, శాసనసభ ఎథిక్స్ కమిటీ చైర్మన్‌గా ఆయన నిర్వహించిన బాధ్యతలు నేటి రాజకీయ నాయకులకు ఆదర్శప్రాయమైన అధ్యాయంగా నిలిచాయి. ప్రస్తుతం రాజకీయాల్లో విలువలు, నైతికత, పరస్పర గౌరవం క్రమంగా కనుమరుగవుతున్నాయనే విమర్శలు వినిపిస్తున్నాయి. అధికారమే లక్ష్యంగా, ప్రజాసేవ రెండో స్థానంలోకి వెళ్లిపోయిందనే




భావన సమాజంలో పెరుగుతోంది. ఇలాంటి సమయంలో యతిరాజారావు వంటి నాయకుల జీవితాన్ని ఒకసారి తిరిగి పరిశీలిస్తే, రాజకీయాల అసలు పరమార్థం ఏమిటో స్పష్టమవుతుంది. యతిరాజారావు గారు రాజకీయాలను అధికారం కోసం కాకుండా బాధ్యతగా చూశారు. ప్రజలు ఇచ్చిన అధికారాన్ని ప్రజల కోసమే వినియోగించాలనే నమ్మకంతో పనిచేశారు. ఆయనకు ప్రజల సమస్యలే ప్రధాన అజెండా. చెన్నూరు నియోజకవర్గంలో ప్రజలతో మమేకమై, వారి కష్టసుఖాల్లో భాగస్వామిగా ఉండటం వల్లే ఆయనపై ప్రజలకు అపారమైన విశ్వాసం ఏర్పడింది. శాసనసభ ఎథిక్స్ కమిటీ చైర్మన్‌గా ఆయన వ్యవహరించిన తీరు రాజకీయ నైతికతకు ఒక ప్రమాణంగా నిలిచింది. శాసనసభ అనేది ప్రజాస్వామ్యానికి ఆలయం అనే భావనతో సభ్యుల ప్రవర్తనలో విలువలు, బాధ్యత, పరస్పర గౌరవం ఉండాలని ఆయన ఎప్పుడూ నమ్మేవారు. నైతికతను కేవలం ఉపన్యాసాల్లో కాకుండా తన వ్యక్తిత్వంలో, తన ప్రజా




జీవితంలో ప్రతిబింబింపజేశారు. ఆయన హుందాతనం గురించి ఇప్పటికీ రాజకీయ వర్గాల్లో గౌరవంగా మాట్లాడుకుంటారు. ఎవరు ఎదురుగా వచ్చినా వారి స్థాయిని కాకుండా వారి మనిషితనాన్ని గౌరవించే సంస్కారం ఆయనది. అందుకే ప్రత్యర్థులు కూడా ఆయనను వ్యక్తిగతంగా గౌరవించేవారు. రాజకీయ భేదాలు ఉన్నప్పటికీ వ్యక్తిగత మర్యాదను ఎప్పుడూ కోల్పోని నాయకుడిగా ఆయనకు ప్రత్యేక గుర్తింపు లభించింది. ప్రజాస్వామ్యంలో నాయకుడి గొప్పతనం ఆయన పదవులతో కొలవబడదు. ప్రజల హృదయాల్లో ఆయనకు ఉన్న స్థానం, ఆయన మరణానంతరం కూడా ప్రజలు గుర్తు చేసుకునే సేవలతో కొలవబడుతుంది. ఆ అర్థంలో యతిరాజారావు గారు నిజమైన ప్రజానాయకుడు. ఆయన జీవితం నేటి రాజకీయ నాయకులకు ఒక పాఠం, భావితరాలకు ఒక స్ఫూర్తి. నాయకత్వం అంటే అధికార ప్రదర్శన కాదని, వినయం, నైతికత, ప్రజల పట్ల అంకితభావం, మానవత్వం కలగలిపిన జీవన విధానమని ఆయన నిరూపించారు. సమాజం ఇలాంటి నాయకులను ఎంత ఎక్కువగా స్మరించుకుంటే, ప్రజాస్వామ్యం అంత బలపడుతుంది. నెమురుగొమ్ముల యతిరాజారావు గారి 96వ జయంతి సందర్భంగా ఆయనకు వినమ్ర నివాళులు అర్పిస్తూ, ఆయన ఆశయాలు, విలువలు, ప్రజాసేవా స్ఫూర్తి నేటి తరానికి మార్గదర్శకంగా నిలవాలని ఆకాంక్షిద్దాం అని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు ముత్తినేని శ్రీనివాస్, తంగళ్ళపల్లి మల్లికార్జున చారి, ఉప సర్పంచ్ ఎర్రగొర్ల రమేష్, వార్డు సభ్యులు డాక్టర్ కుమ్మరి రామ్మూర్తి, కేశబోయిన రేణుక రామరాజు, గద్దల యాకలక్ష్మి యాకన్న, పాక అనిల్, బారాజు ఉపేందర్, వెల్మ బీరన్న, తంగళ్ళపల్లి కిరణ్ చారి, సాయిని వెంకన్న, గుమ్మడవెల్లి వెంకటేశ్వర్లు, ఆర్ ఎం పి డాక్టర్ సదానందం, దంతాలపల్లి వెంకటయ్య, బీసు సునీల్, పల్లె మల్లేష్, బెడద వెంకన్న, నరసింగం ప్రసాద్, తదితరులు ఉన్నారు.

---

# యాది లేని యోధుడు.. పాల్వంచ రాములు

**జూలై 17 తెలంగాణ సాయుధ స్వాతంత్ర్య సమర యోధులు కా. పాల్వంచ రాములు వర్ధంతి సందర్భంగా... ప్రత్యేక కథనం.**

**తొలి అక్షరం/రామన్నపేట జూలై 17:** యాదాద్రి భువనగిరి జిల్లా వలిగొండ మండలం పహిల్వాన్ పురం గ్రామానికి చెందిన తెలంగాణ సాయుధ స్వాతంత్ర్య సమరయోధుడు కా. పాల్వంచ రాములు చనిపోయి (నేటికి ) జూలై 17,2026 కు 19 సంవత్సరాలు పూర్తయింది అయినా అతని జ్ఞాపకాలు నేటికీ ప్రజల మదిని వీడకున్నాయి. ఎందుకంటే అతని పోరాట పటిమ అలాంటిది. అతని 19 వ మరణ వార్షికోత్సవం స్వగ్రామం పహిల్వాన్పురం లో ఘనంగా నిర్వహించడం జరిగింది. అతని వారసులు, గ్రామ ప్రజలు ఈ కార్యక్రమంలో పాల్గొని పాల్వంచ రాములు రంగమ్మ దంతులకు ఘనంగా నివాళులు అర్పించడం జరిగింది. తెలంగాణ విమోచనోద్యమానికి భీజాలు పడింది నల్లగొండ జిల్లాలోనే. దొడ్డి కొమురయ్య, చాకలి ఐలమ్మల పోరాట స్ఫూర్తితో ఎందరో సాయుధ పోరాట యోధులు తయారయ్యి నిరంకుశ నిజాంకు అతని అనుచరులైన రజాకార్లకు వ్యతిరేకంగా వివిధ మార్గాలలో ఉద్యమాలు చేసారు. కొందరు యోధులు ఉద్యమ కారులలో పోరాట స్ఫూర్తిని రగిలించే క్రమంలో ప్రాణాలర్పించి చరిత్రలో నిలిచి పోయారు. మరికొందరు నాయకత్వ మార్గదర్శనంలో భాగంగా ధీరత్వాన్ని ప్రదర్శించి చరిత్రలో నిలిచారు. రావి నారాయణ రెడ్డి,ఆరుట్ల రామచంద్రారెడ్డి, భీంరెడ్డి నర్సింహారెడ్డి, ధర్మ భిక్షం, దాశరథి రంగాచార్య, కాళోజీ నారాయణ రావు., తదితరుల సారధ్యంలో పోరాటం చేసిన ఎందరో చరిత్ర మరచిన సాయుధ పోరాట యోధులు వెలుగులోకి రాలేదు. జీవిత చరమాంకంలో కూడా అనేక ఇబ్బందులతో దుర్భర జీవనం గడిపారు. అలాంటి వారిలో ప్రస్తుత యాదాద్రి భువనగిరి జిల్లా వలిగొండ మండలం పహిల్వాన్ పురం గ్రామానికి చెందిన తెలంగాణ సాయుధ పోరాట యోధుడు కీ.శే. పాల్వంచ రాములు తెలంగాణ సాయుధ పోరాటానికి నాంది పలికిన తొలి ఉద్యమ గడ్డ.. నల్లగొండ జిల్లాలో ఉదయించి ఉద్యమమే ఊపిరిగా నడిచిన బిడ్డ "కీ.శే. పాల్వంచ రాములు.. అలియాస్ బార్బర్ రామ" 1916లో జన్మించారు. ప్రస్తుత యాదాద్రి భువనగిరి జిల్లా వలిగొండ మండలం పహిల్వాన్ పురం అతని జన్మ స్థలం. పాల్వంచ నర్సయ్య- రామక్కలకు ఏకైక సంతానం పాల్వంచ రాములు . చిన్నప్పటినుండే చురుకుగా ఉండే రాములు భారత దేశ స్వాతంత్ర్యోద్యమం గురించి జరిగే



ఉద్యమాలను ఆసక్తిగా గమనించేవారు. యుక్త వయస్సు వచ్చే సరికి రాములు ఆలోచనలన్నీ అతనిని ఉద్యమం వైపుకు మరల్చాయి. ఆ క్రమంలోనే అతని వివాహం 1945లో నందనం గ్రామానికి చెందిన కంతేశ్వరం రామయ్య-నర్సమ్మల కుమార్తె రంగమ్మతో జరిగింది. భారత దేశానికి స్వాతంత్ర్యం సిద్ధించిన 1947 నాటికి తెలంగాణకు మోక్షం లభించలేదు. దేశమంతా స్వాతంత్ర్యోత్సవాలతో ప్రజలు ఆనందంగా గడుపుచుండగా నిజాం సంస్థాన ప్రజలు మాత్రం నిరంకుశ బానిసత్వంలో కూరుకుపోయారు. హైదరాబాదును పాలిస్తున్న ఏడవ నిజాం మీర్ ఉస్మాన్ అలీఖాన్ రాజ్యాన్ని సొంతం చేసుకోవడానికి ప్రయత్నంలో భాగంగా రజాకార్లను ఉసిగొల్పాడు. రజాకార్ల అరాచకాలు మితిమీరడంతో సాయుధ పోరాట ఉద్యమాలు కవులు కళాకారుల స్ఫూర్తితో ఉధృతమయ్యాయి. అందులో భాగంగా ఉద్యమ బాట పట్టిన కీ.శే. పాల్వంచ రాములు అతని గ్రామ సహచరులు , చిన సత్తయ్య, మాల చంద్రిగాడు, జూల రామదాసు, గున్నడు, టేకుల సోమారంకు చెందున , దంతూర్ సాయిలు,కుమ్మరి యెల్లడు చాకలి రామడు తదితరులు సుమారు 60 మంది రావి నారాయణ రెడ్డి సమూహంలో చేరి ఉద్యమంలో చురుకుగా పాల్గొన్నారు. 1947ంవజూ17 నుంచి1948 ంవజూ17



వరకు రావి నారాయణ రెడ్డి సుమారు 300 మందితో "రేపాల క్యాంప్" ను ఏర్పాటు చేశారు. ఈ క్యాంప్ ఇంఛార్జిగా భీంరెడ్డి నర్సింహా రెడ్డి నియమించబడ్డారు. ఈ క్యాంపులోని సభ్యులలో (మోతె)సూర్యాపేటకు చెందిన నూకల రాఘవ రెడ్డి మరికొంత మందితో కలిసి పాల్వంచ రాములు అతని సహచరులు సాయుధ పోరాటంలో చురుకుగా పాల్గొన్నారు. తెలంగాణ అంతటా అనేక సమూహాలు సాయుధ పోరాటంలో పాల్గొంటున్న క్రమంలో ఉద్యమ కారుల్ని, పోరాట యోధుల్ని అణచి వేసే ప్రక్రియకు పూనుకున్న నిజాం, రజాకార్లు పోలీసు బలగాలతో దాడులు చేసి చాలామందిని అరెస్ట్ చేసి జైలుకు తరలించి చిత్రహింసలు పెట్టారు. నూకల రాఘవరెడ్డి గారితో పాటు మరికొందరు అరెస్ట్ కాబడి తేది: 29-05-1357 ఫీూూూ×(29-02-1948) నుంచి 18-12-1357 ఫీూూూ×(18-09-1948) వరకు 6 నెలల పాటు నల్గొండ జిల్లా జైలులో ( అతని జైలు నెం.395) నరకం అనుభవించి "పోలీస్ యాక్షన్" సందర్భంగా విడుదల అయ్యారు. కానీ అంతకు ముందు నుంచే అంటే అక్టోబర్ 1947 లోనే కల్లు కుండలు పగలగొట్టిన కేసు రాములు అతని సహచరులపై నమోదు కాబడి దొరకకుండా అండర్ గ్రౌండ్ లో ఉండడం వలన వారు దొరకలేదు. సంచులలో గుండు రాళ్ళు, కర్రలు, గన్స్ తో పాల్వంచ రాములు,అతని సహ ఉద్యమకారులు 60 మంది వరకు టేకుల సోమారం, గోకారం సహా చుట్టు ప్రక్క గ్రామాలలో కల్లును బ్యాన్ చేసి రజాకార్లు రారికి సహకరించేవేరెవ్వరికీ కల్లు దొరకకుండా కల్లు కుండలు పగలగొట్టి ప్రభుత్వానికి కూడా ఎక్సైజ్ రాకుండా చేశారు. కలాల్ యెంకడు ఇచ్చిన సమాచారంతో కాపర్తి పోలీస్ స్టేషన్ లో ( C.C.no.53/2/1357 fasli ) చార్జి షీట్ నమోదయ్యి భువనగిరి మున్సిఫ్ కోర్టు ద్వారా u/s 370, 34 and 37 rule of security కింద అరెస్ట్ వారెంట్ జారీ అయి కొందరు అరెస్ట్ అయ్యి జైలుకు తరలించబడ్డారు. కనిపిస్తే కాల్చివేత ఉత్తర్వులు కూడా జారీ చేయబడి దొరకకుండా తప్పించుకొని పాల్వంచ రాములుతో పాటు చాలామంది సెప్టెంబర్ 1948 "పోలీస్ యాక్షన్" వరకు అండర్ గ్రౌండ్ లోనే ఉండి రజాకార్లకు చుక్కలు చూపించారు.( 2001లో భువనగిరి కోర్టు ద్వారా లభించిన ఛార్జి షీటు కాపీ ద్వారా వివరాలు) రజాకార్లు రాములు ఆచూకీ కోసం అతని భార్యా పిల్లలను సైతం ఇబ్బందులు పెట్టారు. అయినా బెదరక అతని సమాచారం చెప్పలేదు. నిజాం సెప్టెంబర్ 17న భారత ప్రభుత్వానికి లొంగిపోయి హైదరాబాద్ భారతదేశంలో అంతర్భాగం అయున తర్వాత ఉద్యమ ఖైదీలను సెప్టెంబర్18న విడుదల చేయడంతో అండర్ గ్రౌండ్ లో ఉన్న పాల్వంచ రాములు అతని సహచరులు జన జీవనంలోకి వచ్చారు. ఆ తర్వాత ఉద్యమ కారులను పెద్దగా గుర్తించిందీ లేదు. వారిని ఆదుకున్నదీ లేదు. ఏదో ఒక వృత్తి చేసుకొని జీవనం గడిపారు. స్వతహాగా కళాకారుడైన పాల్వంచ రాములు అజాం కుల వృత్తి చేసుకుంటూ దానితో పాటు ప్రజా చైతన్యం చేసే కళారూపాలను ప్రదర్శిస్తూ కుటుంబ పోషణ చేసుకునేవారు. ఉదయం కులవృత్తి చేస్తూనే రాత్రి వేళల్లో గ్రామ కచ్చీర్ల వద్ద తోలుబొమ్మలాటలు, సామాజిక, పౌరాణిక పాత్రలతో యక్షగానాలు ఊరూరా వేస్తూ ప్రజలను మైమరపించేవారు. పాల్వంచ రాములు కలం నుంచి జాలువారిన "వేయి తలలు ఖండించిన అపూర్వ చింతామణి", "హనుమజ్జననం" ముద్రితమైన యక్షకానాలు ., "విరాట పర్వం-కీచక వధ", "వెంకటేశ్వర కళ్యాణం", "శ్రీ కేదారేశ్వర వ్రతం" లు అముద్రిత యక్షగానాలు . ఇంతే కాకుండా "నాయీ బ్రాహ్మణ జీవిత మాల", "రజక శ్రమ" -- పద్య మాలలు అముద్రితాలుగా మిగిలిపోయునవి. తన జీవిత చరమాంకంలో కడు పేదరికాన్ని అనుభవించిన పాల్వంచ రాములు తేది: 17-07-2007 న మరణించారు. ఇంతటి ఘనకీర్తి కల్గిన తెలంగాణ సాయుధ పోరాట యోధుని ఘనతను యాది చేసుకోవలసిన అవసరం ఎంతైనా ఉంది. ఇలాంటి మరెందరో యాదికి లేని తెలంగాణ స్వాతంత్ర్య సమర యోధుల చరితలను తెలంగాణ భావితరానికి తెలియజేయాల్సిన ఆవశ్యకత ఎంతైనా తెలంగాణ చరిత్రకారులపై ముఖ్యంగా తెలంగాణ ప్రభుత్వంపై ఉంది. కీ.శే. పాల్వంచ రాములు జీవితాన్ని పాఠశాల సాయిలో పాఠ్యాంశంగా ఏర్పాటు చేయాలని తెలంగాణ ప్రభుత్వంను కోరుతూ... జయహో.. తెలంగాణ స్వాతంత్ర్య పోరాట యోధులు కీ.శే. పాల్వంచ రాములు ..

మీకు పాదాభివందన పుష్పాంజలి..!!

---

# యువ సంగ్రామ సభను విజయవంతం చేయాలి....

**జెట్టి శివ ప్రసాద్ యాదవ్ టిఆర్ఎస్వి నియోజకవర్గ మాజీ అధ్యక్షులు...**

**తొలి అక్షరం/రామన్నపేట జూలై 17:** కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సమయంలో యూత్ డిక్లరేషన్ పేరుతో నిరుద్యోగ యువత, విద్యార్థులకు ఎన్నో హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చినప్పటికి, వాటిని అమలు చేయడంలో పూర్తిగా విఫలమైనది అని విమర్శించారు, ఉద్యోగాల భర్తీ, నిరుద్యోగ భృతి, యువత ఆశలను వమ్ము చేసింది అని ఆయన పేర్కొన్నారు, ప్రభుత్వం ఇచ్చిన హామీలను గుర్తు చేస్తూ, వాటి అమలు కోసం ప్రభుత్వం పై ఒత్తిడి తీసుకరావాలనే లక్ష్యం తో బి ఆర్ యస్ యువజన, విద్యార్థి విభాగం ఆధ్వర్యంలో ఈ నెల 18 వ తేదీన సరూర్ నగర్ వేదిక గా నిరుద్యోగ సంగ్రామ సభ నిర్వహిస్తున్నట్లు తెలిపారు, నిరుద్యోగ యువత భవిష్యత్తు విద్యార్థుల హక్కులు, ఉద్యోగ నియమాకాల వేగవంతం,

పెండింగ్ ఫీజు రియాంబర్మెంట్, నోటిఫికేషన్ లు విడుదల వంటి అంశాల పై ఈ సభలో ద్వారా ప్రభుత్వానికి గట్టి సందేశం ఇవ్వనున్నట్లు తెలిపారు, రాష్ట్ర వ్యాప్తంగా నిరుద్యోగ యువత విద్యార్థులు బి ఆర్ యస్ శ్రేణులు యువజన నాయకులు పెద్ద సంఖ్యలో హాజరై సభను విజయవంతం చేయాలనీ అయన పిలుపునిచ్చారు,

నిరుద్యోగులకు విద్యార్థులకు ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని, ఉద్యోగ ఖాళీలను భర్తీ చేయాలని, ఎన్నికలసమయంలో ప్రకటించిన యూత్ డిక్లరేషన్ లోని ప్రతి అంశాన్ని ప్రభుత్వం నెరవేర్చలని డిమాండ్ చేసారు, యువత భవిష్యత్తు ను దృష్టిలో ఉంచుకొని నిర్వహిస్తున్న ఈ నిరసన సభకు ప్రతి ఒక్కరు స్వచ్ఛందంగా తరలి వచ్చి తమ హక్కుల సాధన కోసం గొంతు కలపాలని కోరారు



# నీట్ ఫలితాలలో మోషన్ కాలేజీ విద్యార్థుల ప్రభంజనం




**తొలి అక్షరం/ హన్మకొండ ప్రతినిధి:** నిన్న ప్రకటించిన నీట్ ఫలితాలలో హన్మకొండలోని రాజస్థాన్ కోటా మోషన్ కాలేజీ విద్యార్థులు జాతీయ స్థాయిలో అత్యుత్తమ మార్కులు సాధించడం జరిగిందని మోషన్ కాలేజీ చైర్మన్ వడ్లకొండ వేణుగోపాల్ గౌడ్ తెలిపారు.నీట్ ఫలితాలలో మోషన్ కాలేజీ విద్యార్థులు భూక్యా అశ్విక 531 మార్కులు (హల్ టికెట్ నెంబర్ 4211102168) బొమ్మకంటి నిహారిక 425 మార్కులు (హల్ టికెట్ నెంబర్ 4205111090) సాధించినట్లు తెలిపారు.అత్యుత్తమ మార్కులు సాధించిన విద్యార్థులను,ఈ విజయానికి తోడ్పడిన అధ్యాపకులను,సహకరించిన తల్లిదండ్రులను,కాలేజీ డైరెక్టర్ పెరుమాండ్ల అనిల్ గౌడ్ ప్రిన్సిపాల్ మారపల్లి సమ్మయ్యలు అభినందించారు.

# రామన్నపేట తెలంగాణ ఉద్యమకారులకు న్యాయం చేయాలి

**- కేకే కమిటీ సభ్యులకు వినతి పత్రం అందించిన బొడ్డుపల్లి లింగయ్య**



**తొలి అక్షరం/రామన్నపేట జులై 17:**రామన్నపేట మండలం తెలంగాణ ఉద్యమకారుల ఫోరం ఉపాధ్యక్షులు బొడ్డుపల్లి లింగయ్య హైదరాబాదులో నిర్వహించిన ఉద్యమకారుల సమావేశానికి హాజరై ప్రభుత్వం నియమించినటువంటి కేకే కమిటీకి రామన్నపేట మండల వ్యాప్తంగా తెలంగాణ ఉద్యమంలో పనిచేసిన ప్రతి ఉద్యమకారుడికి న్యాయం చేయాలని వినతి పత్రం అందించడం జరిగినది.

# అఖిల భారతవర్షీయ హైహయ కల్చురి మహాసభ రాష్ట్ర కోశాధికారిగా రవీందర్ గౌడ్ (పరిటాల)





**తొలి అక్షరం/రామన్నపేట జూలై 17:** అఖిల భారతవర్షీయ హైహయ కల్చురి మహాసభ తెలంగాణ రాష్ట్ర ప్రాంత కార్యవర్గ కోశాధికారిగా కొమ్మాయిగూడెం గ్రామానికి చెందిన కప్పల రవీందర్ గౌడ్(పరిటాల రవి) నియమితులయ్యారు.ఈ మేరకు మహాసభ జాతీయ అధ్యక్షుడు జయనారాయణ్ చోకివే,జాతీయ మహాసచివ్ ఎస్ఎన్ఎల్ రాయ్ అధికారిక ప్రకటన విడుదల చేశారు.సమాజ అభివృద్ధి,ఐక్యత, సంస్కృతి పరిరక్షణ మరియు వివిధ సేవా కార్యక్రమాల్లో రవీందర్ గౌడ్ అందిస్తున్న సేవలను,ఆయన కృషిని గుర్తించి ఈ బాధ్యతాయుతమైన పదవికి ఆయన్ను ఎంపిక చేసినట్లు మహాసభ ప్రతినిధులు తెలిపారు.ఈ సందర్భంగా రవీందర్ గౌడ్ కి కల్చురి సమాజ సభ్యులు, హితైషులు హృదయపూర్వక అభినందనలు తెలియజేశారు. ఆయన సేవా దృక్పథం మరింత వికసించి,సమాజానికి ఆదర్శంగా నిలవాలని ఆకాంక్షించారు. రవికుమార్ గౌడ్ మాట్లాడుతూ “ఒక్కటే లక్ష్యం–సేవ,సంస్కృతి, సమగ్రాభివృద్ధి“ అనే ధ్యేయంతో, “సంస్కృతి మనది సమాజం మనది భవిష్యత్తు మన చేతుల్లో“ అనే నినాదంతో సమాజ పురోభివృద్ధికి అందరూ కలిసికట్టుగా ముందుకు సాగాలని ఈ సందర్భంగా ఆయన పిలుపునిచ్చారు.

# అమరవీరుల స్థూపం ఆవిష్కరణను విజయవంతం చేయాలి: టీయూజేఏసీ




**తొలి అక్షరం/షాద్ నగర్, జులై 17:** షాద్‌నగర్‌లో ఈ నెల 19న జరగనున్న తెలంగాణ అమరవీరుల స్థూపం ఆవిష్కరణ కార్యక్రమాన్ని విజయ వంతం చేయాలని తెలంగాణ ఉద్యమ కారుల ఐక్య వేదిక (టీయూ జేఏసీ) పిలుపునిచ్చింది. శుక్రవారం షాద్‌నగర్ పెన్షనర్స్ భవన్‌లో టీజీ శ్రీనివాస్ అధ్యక్షతన జరిగిన విస్తృత స్థాయి సమావేశంలో ఈ మేరకు తీర్మానం చేశారు.రంగారెడ్డి జిల్లా షాద్‌నగర్ ఎంపీడీఓ కార్యాలయం ఆవరణలో స్థానిక ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ తన సొంత నిధులతో నిర్మించిన తెలంగాణ అమరవీరుల స్థూపాన్ని జూలై 19న ఆవిష్కరించడం అభినందనీయమని సమావేశంలో పేర్కొన్నారు. ఈ కార్యక్రమానికి తెలంగాణ ఉద్యమకారులు, ప్రజలు పెద్ద ఎత్తున హాజరై విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.అదే విధంగా, తెలంగాణ ఉద్యమకారులను గుర్తించే ప్రత్యేక గుర్తింపు కమిటీ ఏర్పాటు చేసిన రాష్ట్ర ప్రభుత్వ నిర్ణయాన్ని సమావేశం స్వాగతించింది. నిజమైన ఉద్యమకారులకు న్యాయం జరిగేలా కమిటీ పారదర్శకంగా పనిచేయాలని కోరింది. అలాగే, ప్రొఫెసర్ జయశంకర్‌ను అధికారికంగా “తెలంగాణ జాతిపిత“గా రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించాలని సమావేశంలో ఏకగ్రీవంగా తీర్మానించారు.సమావేశంలో టీయూ జేఏసీ సలహాదారులు వంగూరి గంగిరెడ్డి, రాంబల్ నాయక్, పంది వెంకట్రాంరెడ్డి, నక్కల వెంకటేష్ గౌడ్, గౌరవ అధ్యక్షుడు పినపాక ప్రభాకర్, ప్రధాన కార్యదర్శి శ్రీధర్ రెడ్డి, కోశాధికారి కే. వంశీకృష్ణతో పాటు పలువురు ఉద్యమకారులు, నాయకులు పాల్గొన్నారు.

# విద్యార్థులు చదువు పట్ల శ్రద్ధ చూపాలి

**● సెకండ్ క్లాస్ మెజిస్ట్రేట్ దంతూరి సత్తయ్య ● ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో అవగాహన సదస్సు**






**తొలి అక్షరం/రామన్నపేట, జూలై 17:** విద్యార్థులు చదువు పట్ల శ్రద్ధ వహించాలని సెకండ్ క్లాస్ మెజిస్ట్రేట్ దంతూరి సత్తయ్య అన్నారు. రామన్నపేట మండల న్యాయ సేవ అధికార సంస్థ ఆధ్వర్యంలో మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన ప్రత్యేక అవగాహన సదస్సుకి ముఖ్య అతిథులుగా సెకండ్ క్లాస్ మెజిస్ట్రేట్ దంతూరి సత్తయ్య, ఏజిపి సుక్క శ్రావణ్ లు హాజరయ్యారు. అనంతరం వారు మాట్లాడుతూ విద్యార్థులు అన్ని రంగాలలో ముందు ఉండాలన్నారు. ప్రతి ఒక్కరు చట్టాల మీద అవగాహన కలిగి ఉండాలని తెలిపారు. విద్యార్థులు తప్పని సరిగా విద్యాహక్కు చట్టం, బాల కార్మిక చట్టాలు, లేబర్ చట్టాలు, మాదక ద్రవ్యాలు, మన చుట్టుపక్కల మన దృష్టికి వచ్చే బాల్య వివాహాలు, ఫోక్సో చట్టాలు, తదితర విషయాలపై అందరూ అవగాహన పెంచుకోవాలని అన్నారు. ఎవరు కూడా చెడు వ్యసనాలకు అలవాటు పడవద్దని సూచించారు. ప్రతి పాఠశాలలో చట్టాలకి సంబంధించి ప్రత్యేక కమిటీ ఏర్పాటు చేస్తామని అందులో విద్యార్థులు భాగస్వామ్యం కావాలని అన్నారు. విద్యార్థులకి ఎలాంటి అసౌకర్యాలు, సమస్యలు వచ్చిన స్థానిక పోలీస్ స్టేషన్ లో గాని, మండల న్యాయ సేవ అధికార సంస్థ దృష్టికి గానీ తీసుకువచ్చి పరిష్కారం పొందాలని అన్నారు. ఈ కార్యక్రమంలో మండల విద్యాధికారి సురేందర్ రెడ్డి, లీగల్ సర్వీసెస్ సభ్యులు బత్తుల గణేష్, కానుగంటి శ్రీశైలం, అధ్యాపకులు శేషా చారి, చైల్డ్ ప్రొటెక్షన్ ఆఫీసర్ ఎండి జరీనా, ఎన్.విజయ, కె.శ్రీలక్ష్మి, బి. నాగమణి, ఎండి.అజీజ్, ఎండి.రహిమున్నీసా, ఓఎస్ లు ఆర్.రవి, చక్రపాణి, పోలీస్ సిబ్బంది, కోర్టు సిబ్బంది పాల్గొన్నారు.

# బోనాల ఏర్పాట్లకు సహకరించాలి

**మున్సిపల్ చైర్మన్ అగ్గనూర్ బసవేశ్వర్‌కు గంగపుత్ర సంఘం వినతిపత్రం**



**తొలి అక్షరం/షాద్ నగర్, జులై 17:** రంగారెడ్డి జిల్లా షాద్‌నగర్ మున్సిపాలిటీ పరిధిలోని ఫరూఖ్‌నగర్‌లో గంగపుత్ర సంఘం ఆధ్వర్యంలో ఈ నెల 24న పోచమ్మ బోనాలు, 25న మైసమ్మ తల్లి బోనాల ఉత్సవాలను ఘనంగా నిర్వహించనున్న నేపథ్యంలో ఆలయ పరిసరాల్లో అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పించాలని కోరుతూ గంగపుత్ర సంఘం నాయకులు మున్సిపల్ చైర్మన్ అగ్గనూర్ బసవేశ్వర్కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఫరూఖ్‌నగర్ గంగపుత్ర సంఘం అధ్యక్షుడు జి. సత్తయ్య మాట్లాడుతూ, బోనాల సందర్భంగా పెద్ద సంఖ్యలో భక్తులు ఆలయానికి వచ్చే అవకాశం ఉన్నందున దేవాలయం పరిసరాల్లో ప్రత్యేక పారిశుద్ధ్య చర్యలు చేపట్టడంతో పాటు తగిన లైటింగ్ ఏర్పాటు చేయాలని కోరారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా మున్సిపాలిటీ ప్రత్యేక చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. వినతి పత్రాన్ని స్వీకరించిన మున్సిపల్ చైర్మన్ అగ్గనూర్ బసవేశ్వర్ సమస్యను పరిశీలించి అవసరమైన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చినట్లు సంఘం నాయకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో గంగపుత్ర సంఘం పట్టణ అధ్యక్షుడు నల్లమోని శ్రీధర్, కౌన్సిలర్ మురళీ మోహన్ (అప్పి), తంగడపల్లి శంకర్ పాల్గొన్నారు.

# గిరిజన బిడ్డలతో నిరాడంబరంగా జన్మదిన వేడుకలు జరుపుకున్న పాలమూరు విష్ణువర్ధన్ రెడ్డి





**తొలి అక్షరం/షాద్ నగర్, జులై 17:** బీజేపీ రాష్ట్ర నాయకులు పాలమూరు విష్ణువర్ధన్ రెడ్డి తన జన్మదిన వేడుకలను ఆర్భాటాలకు దూరంగా సామాజిక బాధ్యతతో నిర్వహించారు. కొత్తూరు మండలం పుల్చెర్లకుంట తండాలోని శ్రీ సేవాలాల్ మహారాజ్ దేవాలయంలో గిరిజన బిడ్డల సమక్షంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఆయన ప్రత్యేక పూజలు నిర్వహించి, సిద్ధాపూర్ డంపింగ్ యార్డ్ ముప్పు నుంచి పరిసర ప్రాంతాల్లోని 15 గిరిజన గ్రామాలను కాపాడాలని ప్రార్థించారు.అనంతరం గిరిజన చిన్నారులు, గ్రామస్థులతో కలిసి అన్నప్రసాద వితరణ నిర్వహించి వారితో ఆత్మీయంగా మమేకమయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, తన జన్మదినాన్ని వ్యక్తిగత వేడుకగా కాకుండా గిరిజన సమాజానికి అంకితం చేస్తున్నట్లు తెలిపారు. సిద్ధాపూర్ డంపింగ్ యార్డ్ కారణంగా ప్రజల ఆరోగ్యం, పర్యావరణం, గిరిజనుల జీవన హక్కులు ప్రమాదంలో పడే పరిస్థితి తలెత్తకూడదని అన్నారు.షాద్‌నగర్ నియోజకవర్గ ప్రజలందరూ రాజకీయాలకు అతీతంగా ఏకమై గిరిజన గ్రామాలకు అండగా నిలవాలని ఆయన పిలుపునిచ్చారు. ప్రజల అభిప్రాయాలను పక్కనపెట్టి తీసుకునే ఏకపక్ష నిర్ణయాలను ప్రజాస్వామ్యబద్ధంగా, చట్టబద్ధంగా వ్యతిరేకిస్తామని, అవసరమైతే ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న గిరిజన నాయకులు మాట్లాడుతూ, సిద్ధాపూర్ డంపింగ్ యార్డ్ వ్యతిరేక ఉద్యమం 15 గిరిజన గ్రామాల ప్రజల మనుగడ కోసం జరుగుతోందని తెలిపారు. ప్రతి గ్రామం ఉద్యమంలో భాగస్వామ్యం కావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో కొత్తూరు మండల బీజేపీ అధ్యక్షుడు అత్తాపురం మహేందర్ రెడ్డి, పార్టీ నాయకులు, గిరిజన పెద్దలు, యువ నాయకులు, మహిళలు, కార్యకర్తలు, గ్రామస్థులు పాల్గొని పాలమూరు విష్ణువర్ధన్ రెడ్డికి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.

# తెలంగాణ అమరవీరుల స్థూపం, మహనీయుల విగ్రహాల ఆవిష్కరణను విజయవంతం చేయాలి

**అధిక సంఖ్యలో హాజరై చారిత్రక కార్యక్రమాన్ని విజయవంతం చేయాలి: పి. రఘు నాయక్**



**తొలి అక్షరం/షాద్ నగర్, జులై 17:** షాద్‌నగర్ పట్టణంలో ఏర్పాటు చేసిన తెలంగాణ అమరవీరుల స్థూపం, మహనీయుల విగ్రహాల ఆవిష్కరణ కార్యక్రమాన్ని ఘనంగా విజయవంతం చేయాలని కాంగ్రెస్ పార్టీ గిరిజన విభాగం రాష్ట్ర కో–ఆర్డినేటర్ పి. రఘు నాయక్ పిలుపునిచ్చారు. రంగారెడ్డి జిల్లా షాద్‌నగర్ మున్సిపాలిటీ పరిధిలోని ఎంపీడీవో కార్యాలయ ఆవరణలో స్థానిక ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ ఆధ్వర్యంలో ఈ నెల 19వ తేదీ ఆదివారం ఉదయం 9 గంటలకు నిర్వహించనున్న తెలంగాణ అమరవీరుల స్థూపం, మహనీయుల విగ్రహాల ఆవిష్కరణ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని ఆయన కోరారు. ఈ సందర్భంగా షాద్‌నగర్ మున్సిపల్ చైర్మన్ అగ్గనూర్ బసవేశ్వర్, వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ మహ్మద్ అలీ ఖాన్ బాబర్, కాంగ్రెస్ సీనియర్ నాయకుడు ఆగిర్యాల కృష్ణారెడ్డి, నాయకులు ఇబ్రహీం, జాంగారి రవి, తంగెడపల్లి శంకర్ తదితరులతో కలిసి ఏర్పాటు చేసిన సమావేశంలో రఘు నాయక్ మాట్లాడారు. తెలంగాణ రాష్ట్ర సాధన కోసం ప్రాణత్యాగం చేసిన అమరవీరుల త్యాగాలను చిరస్థాయిగా నిలిపే ఈ కార్యక్రమంలో తెలంగాణ ఉద్యమకారులు, విద్యావంతులు, మేధావులు, తెలంగాణవాదులు, విద్యార్థులు, ప్రజాప్రతినిధులు, అన్ని వర్గాల ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు.తెలంగాణ అమరవీరుల స్ఫూర్తిని భావితరాలకు చాటిచెప్పే ఈ కార్యక్రమం చారిత్రకంగా నిలుస్తుందని, తెలంగాణ ఉద్యమ చరిత్రను గుర్తు చేసే మహనీయుల విగ్రహాల ఆవిష్కరణలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని ఆయన కోరారు.

పులుసుమామిడి గ్రామంలో రూ.5 లక్షలతో

# సీసీ రోడ్డు పనులకు శ్రీకారం

- ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ సహకారంతో అభివృద్ధి

పనులు వేగవంతం: కోగురి పురుషోత్తం రెడ్డి



**తొలి అక్షరం/షాద్ నగర్, జులై 17:** రంగారెడ్డి జిల్లా షాద్‌నగర్ నియోజకవర్గంలోని పులుసుమామిడి గ్రామంలో రూ. 5 లక్షల డీఎంఎఫ్‌టీ (ఐవీఖీ) నిధులతో చేపట్టనున్న సీసీ రోడ్డు నిర్మాణ పనులకు మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు కోగురి పురుషోత్తం రెడ్డి శుక్రవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, స్థానిక ఎమ్మెల్యే, రాష్ట్ర ప్రభుత్వ రంగ సంస్థల కమిటీ చైర్మన్ వీర్లపల్లి శంకర్ సహకారంతో షాద్‌నగర్ నియోజకవర్గంలో అభివృద్ధి పనులు శరవేగంగా కొనసాగుతున్నాయని తెలిపారు. గ్రామాల్లో మౌలిక వసతుల కల్పనకు ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తోందని, ప్రజల అవసరాలకు అనుగుణంగా అభివృద్ధి కార్యక్రమాలను చేపడుతున్నట్లు పేర్కొన్నారు. పులుసుమామిడి గ్రామంలో సీసీ రోడ్డు నిర్మాణం పూర్తయితే గ్రామ ప్రజలకు మెరుగైన రవాణా సౌకర్యం కలుగుతుందని, వర్షాకాలంలో ఎదురయ్యే ఇబ్బందులు తొలగిపోతాయని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ అమర్నాథ్ రెడ్డి, మాజీ ఎంపీటీసీ సభ్యుడు అంజి రెడ్డి, మాజీ సర్పంచ్ జంగీర్, బోరేగ నరేందర్, రాఘవేంద్ర, బబ్లూ గౌడ్, చంద్రయ్య, ఏఈ మధు, శంకర్, కాంగ్రెస్ పార్టీ నాయకులు, గ్రామస్థులు పాల్గొన్నారు

# బిల్లుల పాస్ కోసం బిజెపి వ్యూహం

- విపక్ష పార్టీలను బుట్టలో వేసుకునే యత్నం
- ఈసారి రాజ్యాంగ సవరణ వీగిపోతే బిజెపి పరవు పోయినట్లే...

**న్యూఢిల్లీ,జులై17:** గత పార్లమెంట్ సమావేశాల్లో మహిళా బిల్లు, డీలిమిటేషన్ బిల్లులు వీగిపోవడంతో బిజెపి మరింత పట్టుదలగా అడుగులు వేస్తోంది. బిల్లులు ఆమోదింపచేసుకోవడానికి ఇదే సమయమని కమలనాథులు భావిస్తున్నారు. అయితే చర్చల ద్వారా ఏకాభిప్రాయం సాధించేందుకు మాత్రం ఆ పార్టీ ముందుకు రావడం లేదు. గత సెషన్‌లో బిజెపి వ్యూహాత్మకంగా ఉందని అంతా భావించారు. కానీ ఓటింగ్ సమయంలో దానికి వ్యూహం లేదని తేలిపోయింది. ప్రతిపక్ష పార్టీలే ఓ రకంగా వ్యూహాత్మకంగా నిలిచి తమ పట్టును నిలబెట్టుకున్నాయి. దీంతో రాజ్యాంగ సవరణ బిల్లులు బలం లేకపోవడంతో వీగిపో యాయి. ఇప్పుడు మరోమారు ప్రయత్నంలో బిజెపి వ్యూహం ఫలిస్తుందా లేదా అన్న చర్చ నడుస్తోంది. ఈ క్రమంలో లోకసభ సీట్లను 2011 జనాభా లెక్కల ఆధారంగానే పెంచడానికి ఉద్దేశించిన రాజ్యాంగ సవరణ బిల్లును పార్లమెంటు వర్షాకాల సమావేశాల్లో ఎట్టిపరిస్థితుల్లోనూ నెగ్గించుకోవాలన్న పట్టుదలతో భాజపా నాయకత్వం పనిచేస్తోంది. 2/3వ వంతు ఆధిక్యం లేకపోవడంతో బడ్జెట్ సమావేశాల్లో ఈ బిల్లు వీగిపోవడం అధికారపక్షానికి ఇబ్బందికరంగా పరిణమించింది. తర్వాత ప్రతిపక్షం దూకుడు మొదలుపెట్టింది. ఇటీవల అయిదు రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికల ఫలితాలు వెల్లడైన తర్వాత రాజకీయాల్లో అనూహ్య పరిణామాలు చోటుచేసుకున్నాయి. తృణమూల్‌కు చెందిన 28 మంది లోక్‌సభ సభ్యుల్లో 20 మంది వేరుకుంపటి పెట్టుకొని అధికారపక్షానికి మద్దతు పలికారు. ఇండియా కూటమితో డీఎంకే తెగదెంపులు చేసుకుంది. ఈ రెండు అవకాశాలను అనుకూలంగా మలచుకునే పనిలో భాజపా నాయకత్వం తలమునకలైంది. ఇదివరకు డీలిమిటేషన్ బిల్లులో సీట్లపెంపు ప్రతిపాదన ఉన్నా దానికి ప్రాతిపదికను పెట్టలేదు. ఈసారి అలాకాకుండా.. రాష్ట్రాల్లో ఇప్పుడున్న సీట్లను 50శాతం మేర పెంచుతామని, దానివల్ల లోక్‌సభలో ప్రాతినిధ్య నిష్పత్తి యథాతథంగా కొనసాగుతుందని భరోసా ఇవ్వడానికి బిజెపి సమాయత్తమైంది. ఈ మార్పునకు ఇప్పటికే ఇండియా కూటమిలోని శరద్‌పవార్ పార్టీ ఆకర్షితమైంది. 50శాతం సీట్లు పెంచేలా బిల్లులో స్పష్టత ఇస్తే మద్దతు ఇవ్వడానికి అభ్యంతరం లేదని ప్రకటించింది. డీఎంకే కూడా వ్యతిరేకించకపోవచ్చన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది. భాజపా నాయకత్వం ఈ అంశంపై అన్ని పార్టీలతో తెరవెనుక మంత్రాంగం నెరపుతోంది. ప్రధానంగా డిఎంకె, శరద్ పవార్ నేతృత్వంలోని ఎన్సీపిలను బుజ్జగిస్తున్నట్లు తెలుస్తోంది. తృణమూల్ చీలిపోవడం, మరోపార్టీ ఇండియా కూటమికి దూరంగా ఉండటంతో తమకు ఇంతకంటే మంచి తరుణం రాదని భావించి.. మిగిలిన పార్టీల మద్దతు కూడగట్టే ప్రయత్నాలను కమలనాథులు ముమ్మరం చేశారు. ఇప్పటికే భాజపా అత్యున్నత నాయకత్వం ప్రధానమంత్రి నివాసంలో దీనిపై చర్చించి వ్యూహరచన చేసినట్లు తెలుస్తోంది. ప్రస్తుతం లోక్‌సభలో ఎన్డీయే కూటమికి 293 సీట్లున్నాయి. తృణమూల్ నుంచి విడిపోయిన 20 మంది, ఉద్ధవ్‌ఠాక్రే శివసేన నుంచి బయటపడిన ఆరుగురు ఎంపీలను కలిపితే ఆ సంఖ్య 319కి చేరనుంది. శరద్‌పవార్ పార్టీకి చెందిన 8 మంది మద్దతు లభిస్తే 327కి, డీఎంకే అండగా నిలిస్తే ఈ సంఖ్య 349కి చేరుతుంది. 2/3వ వంతు బలమైన 360ని చేరుకోవడానికి మరో 11మంది అవసరమవుతారు. వైకాపాకు చెందిన నలుగురు, ఒక స్వతంత్ర సభ్యుడు మద్దతు పలకడానికి సిద్ధంగా ఉన్నారు. అంటే ఇంకా ఆరుగురు తక్కువవుతారు. ఒకవేళ డీఎంకే గైర్హాజరైతే సభ సంఖ్యాబలం 518కి తగ్గుతుంది. అప్పుడు హాజరైన వారిలో 346 మంది మద్దతిస్తే చాలు. సభలోని 540 మంది హాజరైతేనే మెజార్టీకి 360 మంది అవసరం అవుతారు. మొత్తంగా బిజెపి వ్యూహం ఫలిస్తుందా లేకపోతే బెడిసి కొడుతుందా అన్నది చూడాలి.

# మారుతున్న మహారాష్ట్ర రాజకీయం

విలీనం దిశగా ఎన్సీపి వర్గాల చర్చలు


మరింత బలహీనంగా ఉద్ధవ్ శివసేన

**ముంబై,జులై17:** మహారాష్ట్ర రాజకీయాలు రంజుగా సాగుతున్నాయి. అధికార ఎన్‌డిఎ తనకు అనుకూలంగా పరిస్థితులను మార్చుకుంటోంది. అలాగే ఎన్సీపిని బలోపేతం చేసి అంటే రెండు వర్గాలను కలిపి దగ్గరకు తీసుకోవాలని చూస్తోంది. శరద్ పవార్ కూతురు సుప్రియా సులఅఏకు మంత్రి పదవిఇ కట్టబెట్టడం ఖాయంగా కనిపిస్తోంది. ఇకపోతే ఉద్ధవ్ నేతృత్వంలోని శివసేన ఇప్పటికే బలహీన పడింది. ఇదంతా ఒక ఎత్తయితే నేషనలిస్ట్ కాంగ్రెస్ పార్టీ(ఎన్‌సీపీ)లో ఉత్కంఠ నెలకొనడంతో మహారాష్ట్ర రాజకీయం మరింత ముదురుతోంది. అధికార కూటమికి చెందిన అజిత్ పవార్ వర్గం ఎన్‌సీపీలో, శరద్ పవార్(ఎస్పీ) నేతృత్వంలోని ఎన్‌సీపీ(ఎస్‌పీ)లో అంతర్గత పరిణామాలు వేగంగా మారుతున్న సంకేతాలు కనిపిస్తున్నాయి. సీఎం దేవేంద్ర ఫడణవీస్‌తో జరిగిన వరుస భేటీలు ఆ రాష్ట్ర రాజకీయాల్లో కొత్త ఊహాగానాలకు తెరతీస్తున్నాయి. ఎన్‌సీపీ సీనియర్ నేతలు ప్రఫుల్ పటేల్, సునీల్ తట్కరే ఇటీవల సీఎం ఫడణవీస్‌ను కలవడం కూడా చర్చనీయాంశమైంది. ఆ మరుసటి రోజే డిప్యూటీ సీఎం సునేత్ర పవార్ కుమారుడు, ఎంపీ పార్థ్ పవార్ కూడా ముఖ్యమంత్రితో సమావేశమయ్యారు. ఈ భేటీలపై అధికారికంగా ఎలాంటి సమాచారం అందకపోయినా.. రాజకీయంగా మాత్రం ప్రాధాన్యం సంతరించుకుంది. ఇక.. పార్టీ వర్గాల సమాచారం ప్రకారం, ప్రఫుల్ పటేల్, సునీల్ తట్కరేలు ప్రస్తుతం పార్టీ వ్యవహారాల్లో తమకు ప్రాధాన్యం తగ్గిందనే అసంతృప్తితో ఉన్నట్లు తెలుస్తోంది. అజిత్ పవార్ మరణానంతరం.. ఆయన సతీమణి సునేత్ర పవార్ పార్టీ బాధ్యతలు చేపట్టగా, కుమారుడు పార్థ్ పవార్ కూడా పార్టీ వ్యవహారాల్లో ఎక్కువగా కల్పించుకుంటుండంతో కొందరు సీనియర్ నేతలు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. అయితే.. పార్టీని సరిదిద్దే చర్యలు తీసుకోవాలని ప్రఫుల్ పటేల్ ఇటీవల బహిరంగంగా అనడం ఈ వాఖ్యలకు మరింత బలాన్ని చేకూరుస్తోంది. మరోవైపు పార్టీ జాతీయ కార్యదర్శి సచ్చిదానంద్ సింగ్.. సునేత్ర పవార్‌ను పార్టీ అధ్యక్షురాలిగా నియమించడాన్ని ప్రశ్నిస్తూ, ఆ ఎన్నిక చెల్లదని బహిరంగంగా వ్యాఖ్యానించడమూ పార్టీలో అసంతృప్తిని బయటపెట్టింది. మరోవైపు.. ఎన్సీ వర్గానికి చెందిన సీనియర్ నేత జయంత్ పాటిల్ కూడా ఇదే సమయంలో సీఎం ఫడణవీస్‌ను కలవడం రాజకీయ చర్చలకు మరింత ఊతమిచ్చింది. ప్రత్యర్థి వర్గాలకు చెందిన ముగ్గురు కీలక నేతలు ఏకకాలంలో ఇలా సీఎంను కలవడం వెనుక రాజకీయ ప్రాధాన్యం ఉందనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. యితే.. ఈ సమావేశాలు పూర్తిగా పాలనా అంశాలకే సంబంధించినవని సునీల్ తట్కరే స్పష్టం చేశారు. ఇందులో రాజకీయ కోణమేమీ లేదని, విలీనంపైనా ఎలాంటి చర్చ జరగలేదని ఆయన చెప్పారు. అజిత్ పవార్ జీవించి ఉన్న సమయంలోనే రెండు ఎన్‌సీపీ వర్గాల విలీనంపై చర్చలు జరిగాయని, ప్రస్తుతం అలాంటి ప్రతిపాదనలేమీ లేవని పేర్కొన్నారు. మరోవైపు, ప్రఫుల్ పటేల్, సునీల్ తట్కరేలు శరద్ పవార్ వర్గానికి చెందిన కొందరు నేతలతో సంప్రదింపులు జరుపుతున్నారనే ప్రచారం కూడా సాగుతోంది. అయితే శరద్ పవార్ వర్గం ఈ వార్తలను ఖండించింది. తమ పార్టీ ఇప్పటికీ ఇండియా కూటమితోనే కొనసాగుతోందని ఆ పార్టీ ఎంపీ సుప్రియా సూలే స్పష్టం చేశారు. అధికారికంగా ఎలాంటి నిర్ణయం వెలువడకపోయినా, వరుస భేటీలు, పార్టీల్లో పెరుగుతున్న అసంతృప్తి, విలీనం లేదా రాజకీయ పునర్వ్యవస్థీకరణపై వినిపిస్తున్న ప్రచారం మహారాష్ట్ర రాజకీయాల్లో ఆసక్తిని రేకెత్తిస్తోంది. రానున్న రోజుల్లో ఈ పరిణామాలు ఎలాంటి మలుపు తిప్పుతాయనే ఉత్కంఠ సర్వత్రా నెలకొంది.

# సోషల్ మీడియా... ఒక కొత్త ప్రపంచం

సోషల్ మీడియా అంటే
చేతిలో ఉన్న ఫోన్ కాదు
ప్రపంచమంతా మన గడపకు
వచ్చిన కాలం.
ఇన్‌స్టాగ్రామ్ అంటే
కేవలం రీల్స్ కాదు
కలలకు రెక్కలు తొడిగే రంగుల
వేదిక.
ఫేస్‌బుక్ అంటే
పోస్ట్‌ల పుస్తకం కాదు
జ్ఞాపకాలను గుండెల్లో దాచుకునే
ఆల్బమ్.
వాట్సాప్ అంటే
మెసేజ్‌ల వరుస కాదు
మనసులను కలిపే మమతల
దారి.
యూట్యూబ్ అంటే
వీడియోల సముద్రం కాదు
విజ్ఞానాన్ని వెలిగించే దీపస్తంభం.
ఎక్స్ అంటే
అక్షరాల సంఖ్య కాదు
ఆలోచనల బలం.
టెలిగ్రామ్ అంటే
ఒక యాప్ కాదు
సమాచారం చేరే వేగవంతమైన
మార్గం.
కానీ ఒక్కసారి ఆలోచించు మనిషీ
ఈ సోషల్ మీడియా నిన్ను
నడిపిస్తుందా?
లేక నువ్వే సోషల్ మీడియాను
నడిపిస్తున్నావా?
ఒక పోస్ట్
ఒక మాట
ఒక వీడియో
ఒక జీవితం మార్చగలదు.
ప్రేమను పంచితే ప్రేమ
పెరుగుతుంది
జ్ఞానాన్ని పంచితే సమాజం
ఎదుగుతుంది
ద్వేషాన్ని పంచితే మనిషే మనిషికి
దూరమవుతాడు.
అందుకే
సోషల్ మీడియాను సమయాన్ని
చంపే సాధనంగా కాదు
సమాజాన్ని మార్చే ఆయుధంగా
మార్చు.
నీ వేలి చివర ఉన్న ఫోన్‌లోనే
నీ భవిష్యత్తు ఉంది
నీ పేరు ఉంది
నీ గౌరవం ఉంది
నువ్వు సమాజానికి ఇచ్చే సందేశం
ఉంది.
గుర్తుంచుకో
సోషల్ మీడియాలో వైరల్ కావడం
గొప్ప కాదు
సమాజం గుండెల్లో చిరస్థాయిగా
నిలిచిపోవడమే నిజమైన
విజయం.

– రచన: ప్రవీణ్ బాయ్



# చైనా గురించి ఆయాస పడాలా!



‘దీనమ్మ జీవితం’ అన్నట్లుగా చైనాలో ఏ పరిణామం జరిగినా మీడియాలో కొందరు పెద్దలకు పండగే. అధినేత షీ జిన్‌పింగ్ మీద తిరుగుబాటు చేసి కొత్త నేతను ఎన్నుకుంటారంటూ గతంలో ఎంత యాగీ చేసిందీ చూశాము. తరువాత తేలుకుట్టిన దొంగల మాదిరి ఉన్నారు. చైనా ప్రభుత్వం, అభివృద్ధి, సాధించిన విజయాల గురించి ప్రకటించినపుడు అవన్నీ ఉత్తుత్తి అంకెలే అని పిట్టకతలు చెబుతారు. తాజాగా తొలి ఆరునెలల్లో ఆర్థిక రంగంలో తలెత్తిన వడిదుడుకుల గురించి ప్రస్తావించి వివరాలను ప్రకటించింది. దీన్ని పట్టుకొని ఇంకేముంది చైనా అధోగతి పాలవుతోందంటూ చిలవలు పలవలుగా వ్యాఖ్యానాలు చేస్తున్నారు. వర్తమాన సంవత్సరంలో తమ వృద్ధి రేటు లక్ష్యం 4.5 నుంచి ఐదు శాతం వరకు నిర్ణయిం చినట్లు ప్రభుత్వం గతంలో ప్రకటించింది. అయితే ఆరు నెలల్లో వృద్ధి రేటు 4.7శాతమే నమోదైంది. మొదటి మూడు నెలల్లో ఐదుశాతం నమోదు కాగా తదుపరి అది 4.3శాతమే అయింది గనుక సంబర పడుతున్నారు. ‘ఇంకా ఆరు నెలల సమయం ఉంది, ఇంకా పెరుగుతుందా, తగ్గుతుందా అన్నది అనేక పరిస్థితుల మీద ఆధారపడి ఉంటుంది. తాజా తగ్గుదలను గుణపాఠంగా తీసుకోవాలని’ దేశ పౌరులకు ప్రభుత్వం చెప్పింది. ప్రపంచ ఆర్థిక అనిశ్చితి పెరుగుతున్నప్పటికీ ఆరునెలల్లో 4.7శాతం పెరుగుదలను తక్కువ అంచనావేసి చంకలు కొట్టుకొంటే ఆయాసం తప్ప ఇతర దేశాలకు ఒరిగేదేమీ ఉండదు. చైనాలో వృద్ధి రేటు ఎందుకు తగ్గిందో తులనాత్మకంగా పరిశీలించాల్సిన అవసరం ఉంది. ప్రపంచ వస్తూత్పత్తి ఫ్యాక్టరీగా పేరు తెచ్చుకున్న చైనా ఇటీవలి కాలంలో తక్కువ ధరల్లో తయారు చేసే వినిమయ వస్తువుల మీద కేంద్రీకరణ తగ్గించింది. అధునాతన సాంకేతిక ప్రక్రియలతో తయారయ్యే, హరిత ఉత్పత్తుల మీద కేంద్రీకరించి పశ్చిమ దేశాలకు సవాలు విసురుతోంది. మార్కెట్‌లో తీవ్రమైన పోటీని ఎదుర్కోవటం అంతతేలిక కాదు, అయినా ‘పరుగెత్తి పాలు తాగటం కంటే నిలబడి నీళ్లు తాగటం’ మేలన్నట్టు ముందుకు పోతోంది. చిప్స్, మొబైళ్ల తయారీకి ప్రోత్సాహకంగా రూ. 1.89లక్షల కోట్లు కేటాయించినట్లు మన కేంద్ర ప్రభుత్వం పన్నెండేండ్ల తరువాత గొప్పగా ప్రకటించింది. అసలు లేనిదాని కంటే కుంటిదో గుడ్డిదో ఏదో ఒక గుర్రం ఉంటే బండిలాగించవచ్చన్నట్లుగా ఈ చర్యను పరిగణించాలి. వర్తమాన ప్రపంచంలో యంత్రం నుంచి కాఫీ తీసుకోవాలన్నా, యుద్ధ విమానాలను నడపాలన్నా చిప్ కావాల్సిందే. గూగుల్ కృత్రిమ మేధ చెప్పిన సమాచారం ప్రకారం ప్రస్తుతం చైనా రోజుకు 140 కోట్ల చిప్స్ తయారు చేస్తున్నది. మోడీ ప్రకటించిన రాయితీలు అమల్లోకి వచ్చిన తరువాత మన ఉత్పత్తి రోజు 7.5నుంచి ఎనిమిది కోట్ల వరకు పెరుగుతుందట, అప్పటి వరకు చైనా చేతులు ముడుచుకు కూర్చుంటుందా? చిప్స్ తయారీలో ప్రస్తుతం చైనా తిరుగుబాటు ప్రాంతమైన తైవాన్ రాష్ట్రం, అమెరికా, మొత్తంగా ఐరోపా దేశాలు అగ్రస్థానంలో ఉన్నాయి. వాటిని వెనక్కు నెట్టేందుకు చైనా ముందుచూపుతో వ్యవహరిస్తే తిరోగామి ఆలోచనలతో ఉన్న బీజేపీ, దాన్ని సమర్ధించే పార్టీలు దేశాన్ని ఎంత వెనక్కు నెట్టాయో అర్ధం చేసుకోవచ్చు.

# తెలుగు ఇండస్ట్రీని ఆకాశానికెత్తిన రకుల్ ప్రీత్.. బాలీవుడ్‌పై తీవ్ర విమర్శలు

టాలీవుడ్, బాలీవుడ్ చిత్ర పరిశ్రమల పనితీరుపై కథానాయిక రకుల్ ప్రీత్ సింగ్ ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. తెలుగు చలనచిత్ర పరిశ్రమలోని సహకార స్ఫూర్తిని కొనియాడిన ఆమె, బాలీవుడ్‌లో మాత్రం అభద్రతాభావం, అసూయ వంటి ధోరణులు ఎక్కువగా కనిపిస్తాయని అభిప్రాయపడ్డారు.
ఇటీవల ఒక ఇంటర్వ్యూలో పాల్గొన్న రకుల్, తన సినీ ప్రయాణం మొదలైన తెలుగు చిత్ర పరిశ్రమపై ప్రశంసలు కురిపించారు. "టాలీవుడ్‌లో ఒకరి సినిమాలను మరొకరు బహిరంగంగా ప్రోత్సహిస్తారు. తోటి నటీనటుల చిత్రాల ట్రైలర్లను వడుదల చేయడం, వేడుకలకు హాజరవ్వడం వంటివి ఇక్కడ సాధారణం. వృత్తిపరమైన పోటీ ఉన్నప్పటికీ, ఒకరి విజయాన్ని మరొకరు మనస్ఫూర్తిగా ఆస్వాదిస్తారు" అని ఆమె పేర్కొన్నారు. ఈ విషయంలో బాలీవుడ్ పరిస్థితి భిన్నంగా ఉంటుందని, అక్కడ అసూయ, అభద్రతాభావం కారణంగా పరస్పర సహకారం చాలా తక్కువని ఆమె అన్నారు. కొందరు కావాలనే ఇతరులపై ప్రతికూల ప్రచారాలు (నెగెటివ్ పీఆర్ క్యాంపెయిన్లు) నిర్వహిస్తారని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. "తెలుగు పరిశ్రమలో ఐక్యత, సహృద్భావం మెండుగా ఉంటాయి. ఈ లక్షణాలను హిందీ పరిశ్రమ కూడా అలవర్చుకుంటే అది మరింత బలోపేతం అవుతుంది" అని రకుల్ సూచించారు. గతంలోనూ అల్లు అర్జున్, మహేశ్ బాబు వంటి అగ్ర హీరోల వినయాన్ని, వృత్తి పట్ల వారికున్న నిబద్ధతను ఆమె కొనియాడారు. దక్షిణాదిలో గడించిన అనుభవాలే తన కెరీర్‌ను తీర్చిదిద్దాయని, ఇక్కడి ప్రేక్షకుల ఆదరణ వల్లే తాను ఈ స్థాయిలో ఉన్నానని ఆమె కృతజ్ఞత చాటుకున్నారు. రకుల్ చేసిన ఈ వ్యాఖ్యలపై సామాజిక మాధ్యమాల్లో విశేష స్పందన లభిస్తోంది. ముఖ్యంగా తెలుగు ప్రేక్షకులు ఆమెపై ప్రశంసలు కురిపిస్తున్నారు. తన ఎదుగుదలకు తోడ్పడిన పరిశ్రమ పట్ల ఆమె చూపిన గౌరవానికి నెటిజన్లు హర్షం వ్యక్తం చేస్తున్నారు.



# ఉప ఎన్నికలకు సిద్ధం

## టాలీవుడ్ డ్యాన్స్ డైరెక్టర్స్ అసోసియేషన్ సంచలన నిర్ణయం..



టాలీవుడ్ డ్యాన్స్ డైరెక్టర్స్ అసోసియేషన్ (ఖీఔణణూ) కీలక నిర్ణయం తీసుకుంది. మొత్తం అసోసియేషన్ ఎన్నికలకు సిద్ధమవుతున్నట్టు ప్రకటించింది. ఫెడరేషన్ జోక్యాన్ని ఖండిస్తూ లేఖ విడుదల చేసిన అసోసియేషన్, ఖాళీ అయిన పోస్టులకు ఎన్నికలు నిర్వహించాలని మెజార్టీ సభ్యుల డిమాండ్ మేరకు ఉప ఎన్నికలకు నిర్ణయం తీసుకుంది. ఎన్నికల ప్రక్రియను జులై 20న నామినేషన్లు దాఖలు స్వీకరించడంతో ప్రారంభించనున్నట్లు అసోసియేషన్ ప్రకటించింది. ఎన్నికల అధికారి అదే రోజు నుంచి నామినేషన్ల పరిశీలన చేయనున్నట్లు తెలిపింది. జులై 22 వరకు నామినేషన్ల ఉపసంహరణ ప్రక్రియ కొనసాగుతుందని స్పష్టం చేసింది.
ఎన్నికల నిబంధనల ప్రకారమే ఈ ఎలక్షన్స్ జరుగుతాయని అసోసియేషన్ తెలిపింది. అసోసియేషన్‌లో ఇటీవల జరిగిన వివాదం నేపథ్యంలో 10 మంది సభ్యులను సస్పెండ్ చేశారు. మిగిలిన ఆరుగురు కూడా ఉప ఎన్నికలకు సిద్ధమవుతున్నట్లు ప్రకటించడంతో అసోసియేషన్ ఈ నిర్ణయం తీసుకుంది. ప్రజాస్వామ్య పద్ధతిలో ఎన్నికలకు వెళ్లాలని నిర్ణయించుకున్నట్లు అసోసియేషన్ స్పష్టం చేసింది.

# నలుగురు హీరోయిన్లు?

**రాఘవ లారెన్స్ 30వ సినిమాపై ఆసక్తికర ప్రచారం**

**లారెన్స్ సరసన సాయి పల్లవి, జాన్వీ, రుక్మిణి, కయాదు**

**ఇది లారెన్స్ సొంత నిర్మాణ సంస్థలో రానున్న చిత్రం**

**నూతన దర్శకుడు తిరుపుగల్ ఈ సినిమాను తెరకెక్కిస్తున్న వైనం**




నటుడు, కొరియోగ్రాఫర్ రాఘవ లారెన్స్ తన కెరీర్‌లో మైలురాయిగా నిలిచే 30వ సినిమాకు సిద్ధమవుతున్నారు. 'ఆర్ఎల్-30' అనే వర్కింగ్ టైటిల్‌తో ఈ ప్రాజెక్ట్‌ను ఇటీవలే అధికారికంగా ప్రకటించారు. అయితే, సినిమా ప్రారంభం కాకముందే దీని క్యాస్టింగ్ సంచలనంగా మారింది. ఈ చిత్రంలో ఒకరు కాదు, ఏకంగా నలుగురు ప్రముఖ హీరోయిన్లు నటించనున్నారంటూ వార్తలు వచ్చాయి. ఈ భారీ చిత్రంలో సాయి పల్లవి, జాన్వీ కపూర్, రుక్మిణి వసంత్, కయాదు లోహర్ కీలక పాత్రలు పోషించనున్నారని సోషల్ మీడియాలో వార్తలు వైరల్ అవుతున్నాయి. ఈ నలుగురు నటీమణులకు ఉన్న క్రేజ్ దృష్ట్యా సౌత్ ఇండియన్ సినిమాలో ఇది చర్చనీయాంశం అయింది. దాంతో సినిమాపై అంచనాలు అమాంతం పెరిగిపోయాయి.
ఈ చిత్రాన్ని రాఘవ లారెన్స్ తన సొంత నిర్మాణ సంస్థ 'రాఘవేంద్ర ప్రొడక్షన్స్' బ్యానర్‌పై నిర్మిస్తుండటం విశేషం. తిరుపుగల్ అనే నూతన దర్శకుడు ఈ సినిమాతో పరిచయం అవుతున్నారు. సాయి అభ్యంకర్ సంగీతం అందిస్తున్నారు. ఇంటెన్స్ యాక్షన్ ఎంటర్‌టైనర్‌గా తెరకెక్కుతున్న ఈ సినిమాపై హీరోయిన్ల వార్తలతో ప్రేక్షకుల్లో ఆసక్తి రెట్టింపైంది.

# సరికొత్త సామాజిక క్యాంపెయిన్.. రకుల్, సమంతలకు కాజల్ సవాల్!

ఆహార కల్తీ, ప్రజలపై పడుతున్న దుష్ప్రభావాలపై క్యాంపెయిన్

మనం తినే ఆహారం నిజంగానే సురక్షితమా అని ప్రశ్న

టాలీవుడ్ స్టార్ హీరోయిన్ కాజల్ అగర్వాల్ తన లేటెస్ట్ చిత్రం 'ది ఇండియన్ స్టోరీ' ప్రమోషన్స్‌లో భాగంగా సామాజిక అవగాహన క్యాంపెయిన్‌ను ప్రారంభించింది. పురుగుమందుల వాడకం, ఆహార కల్తీ, దానివల్ల ప్రజల ఆరోగ్యంపై పడుతున్న దుష్ప్రభావాలను ఈ సినిమాలో చూపించారు. చేతన్ డీకే దర్శకత్వంలో రూపొందిన ఈ చిత్రంలో కాజల్, శ్రేయస్ తల్పడే జంటగా నటించారు.
ఈ క్రమంలో, కాజల్ #WhatsOnYourPlateµ (మీ ప్లేట్ లో ఏముంది) అవగాహన ప్రచారాన్ని ప్రారంభించింది. తన రాత్రి భోజనం ఫోటోను సోషల్ మీడియాలో పంచుకుంటూ, మనం తినే ఆహారం నిజంగా సురక్షితమేనా అని ప్రశ్నించింది. ప్రతి ఒక్కరూ తాము తినే ఆహారం పట్ల మరింత శ్రద్ధ వహించాలని కోరింది. ఈ ఛాలెంజ్‌లో టాలీవుడ్ స్టార్ హీరోయిన్లు రకుల్ ప్రీత్ సింగ్, సమంతలను కూడా పాల్గొనమని సవాల్ విసిరింది.

నటుడు శ్రేయస్ తల్పడే కూడా కాజల్ అభిప్రాయాన్ని బలపరుస్తూ పోస్ట్ చేశాడు. ప్రజలందరూ బాధ్యతాయుతమైన వినియోగదారులుగా మారాలని, మనం ప్లేట్లలో పెట్టుకుని తినే ఆహారం వెనుక ఉన్న అసలు నిజాలు, నివేదించబడని సమస్యలపై చర్చ జరగాలని శ్రేయస్ పిలుపునిచ్చాడు.

ఈ చిత్రం వివరాల్లోకి వస్తే... జీ స్టూడియోస్, ఎమ్ఐజీ ప్రొడక్షన్ స్టూడియోస్ సమర్పకులుగా



# సోనమ్ వాంగ్‌చుక్‌ను చూసి '3 ఇడియట్స్' హీరో పాత్రను రూపొందించలేదు: ఆమిర్ ఖాన్



బాలీవుడ్ సూపర్ హిట్ చిత్రం '3 ఇడియట్స్'లోని ఫున్‌సుఖ్ వాంగ్డూ పాత్ర ప్రేక్షకులను విశేషంగా ఆకట్టుకుంది. ఈ పాత్రను అగ్ర కథానాయకుడు ఆమిర్ ఖాన్ పోషించిన సంగతి తెలిసిందే. అయితే, ఆ పాత్రకు లడఖ్‌కు చెందిన ప్రముఖ విద్యావేత్త, సామాజిక కార్యకర్త సోనమ్ వాంగ్‌చుక్ స్ఫూర్తి అని చాలా కాలంగా ప్రచారం జరుగుతోంది. తాజాగా ఈ విషయంపై ఆమిర్ ఖాన్ స్వయంగా స్పందించారు. ఆ ప్రచారంలో వాస్తవం లేదని స్పష్టం చేశారు. సోనమ్ వాంగ్‌చుక్‌కు, ఆ పాత్రకు ఎలాంటి సంబంధం లేదని వెల్లడించారు. లండన్ ఇండియన్ ఫిల్మ్ ఫెస్టివల్‌లో జరిగిన ఒక కార్యక్రమంలో ఆమిర్ మాట్లాడారు. '3 ఇడియట్స్' కథా చర్చల సమయంలో తమకు సోనమ్ వాంగ్‌చుక్ గురించి తెలియదని పేర్కొన్నారు. వ్యక్తిగతంగా కూడా ఆయన్ను ఎప్పుడూ కలవలేదని చెప్పారు. అందుకే ఫున్‌సుఖ్ వాంగ్డూ పాత్రను ఆయన జీవితం ఆధారంగా రూపొందించలేదని స్పష్టం చేశారు. ఈ సినిమాలో 'చతుర్' పాత్ర పోషించిన ఓమీ వైద్య విడుదల చేసిన ఒక వీడియోపై కూడా ఆమిర్ స్పందించారు. ఫున్‌సుఖ్ పాత్ర సోనమ్ వాంగ్‌చుక్‌ను చూసి రూపొందించారని ఓమి చెప్పడం సరికాదని ఆయన అన్నారు. ఆ వ్యాఖ్యల్లో వాస్తవం లేదని తేల్చిచెప్పారు. అయితే, సోనమ్ వాంగ్‌చుక్ చేస్తోన్న సామాజిక సేవలను తాను ఎంతగానో గౌరవిస్తానని ఆమిర్ తెలిపారు. ప్రస్తుతం ఆయన చేస్తోన్న నిరవధిక నిరాహార దీక్ష గురించి ప్రస్తావిస్తూ.. సోనమ్ ఆరోగ్యం క్షీణిస్తోందని, దీక్ష విరమించాలని పలువురు కోరుతున్నారని చెప్పారు. వాంగ్‌చుక్‌ను గౌరవించడానికి '3 ఇడియట్స్' పాత్రతో ముడిపెట్టాల్సిన అవసరం లేదని, ఆయన చేస్తోన్న కృషి అసామాన్యమైనదని ఆమిర్ కొనియాడారు. నీట్ పేపర్ లీక్ వివాదం నేపథ్యంలో సోనమ్ వాంగ్‌చుక్ గత 20 రోజులుగా నిరవధిక నిరాహార దీక్ష చేస్తున్న విషయం తెలిసిందే. పేపర్ లీక్‌కు బాధ్యత వహిస్తూ కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ తన పదవికి రాజీనామా చేయాలని ఆయన డిమాండ్ చేస్తున్నారు. రోజురోజుకూ ఆయన ఆరోగ్యం క్షీణిస్తుండడంతో వెంటనే దీక్ష విరమించాలని పలువురు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మరోవైపు, కేంద్ర ప్రభుత్వం ఆయన డిమాండ్లను పరిగణనలోకి తీసుకోవడం లేదనే విమర్శలు కూడా వెల్లువెత్తుతున్నాయి.

# ఓటీటీలోకి వచ్చేసిన 'మా ఇంటి బంగారం'..



స్టార్ హీరోయిన్ సమంత సుమారు మూడేళ్ల విరామం తర్వాత 'మా ఇంటి బంగారం' చిత్రంతో మంచి విజయాన్ని అందుకున్నారు. థియేటర్లలో బాక్సాఫీస్ వద్ద రికార్డు స్థాయిలో వసూళ్లు రాబట్టిన ఈ సినిమా, ఇప్పుడు డిజిటల్ ప్రేక్షకులను అలరించేందుకు ఓటీటీ వేదికపైకి వచ్చేసింది. హీరోయిన్ ఓరియెంటెడ్ చిత్రాల్లో రూ. 100 కోట్లకు పైగా వసూళ్లు సాధించిన తొలి తెలుగు సినిమాగా చరిత్ర సృష్టించిన ఈ ఫ్యామిలీ ఎంటర్‌టైనర్, ఇప్పుడు డిజిటల్ ప్రియుల ముందుకు వచ్చింది. ఈ సినిమా డిజిటల్ స్ట్రీమింగ్ హక్కులను ప్రముఖ ఓటీటీ సంస్థ 'జియో హాట్‌స్టార్' దక్కించుకుంది. ముందుగా ప్రకటించిన షెడ్యూల్ ప్రకారమే గురువారం అర్ధరాత్రి నుంచే ఈ చిత్రం స్ట్రీమింగ్‌కు అందుబాటులోకి వచ్చింది. కేవలం తెలుగులోనే కాకుండా తమిళం, కన్నడ, మలయాళ భాషల్లోనూ ఈ సినిమాను విడుదల చేశారు. దీంతో దక్షిణాది సినీ ప్రియులు ఈ చిత్రాన్ని వీక్షించేందుకు ఆసక్తి చూపుతున్నారు. థియేటర్లలో కుటుంబ ప్రేక్షకులను, ముఖ్యంగా మహిళలను ఎంతగానో ఆకట్టుకున్న ఈ సినిమా, ఇప్పుడు ఓటీటీలోనూ అదే ఆదరణ పొందుతుందని చిత్రబృందం ధీమా వ్యక్తం చేస్తోంది.